# మన జనప్రగతి

జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక

సంపుటి : 6 | సంచిక : 173 | పేజీలు : 8 | వెల : రూ.2/- ఆదివారం 19 జూలై 2026 | వైఎస్సార్ కడప

Circulated by Kadapa, Ananthapur, Chittor, Vishakapatanam, Srikakulam, Elluru, Thirupathi, Ongole, Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool




## భారత అంతరిక్ష రంగంలో సరికొత్త అధ్యాయం

● స్కైరూట్ ఏరోస్పే 'విక్రమ్-1' రాకెట్ ప్రయోగం విజయవంతం ● తొలుత ఇంధన ప్రక్రియలో సాంకేతిక లోపం ● అరగంటలోపే సరిదిద్ది ప్రయోగాన్ని పూర్తి చేసిన షార్ ● ప్రైవేట్ రంగంలో తొలి రాకెట్ కావడంతో సర్వత్రా హర్షం ● ప్రయోగాన్ని వీక్షించిన లోకేశ్, ఇస్రో మాజీ శాస్త్రవేత్తలు

**శ్రీహరికోట,మన జనప్రగతి జూలై 18:** భారత అంతరిక్ష రంగంలో సరికొత్త అధ్యాయం ప్రారంభమైంది. శ్రీహరికోట షార్ అంతరిక్ష కేంద్రం నుంచి చేపట్టిన ప్రయోగం విజయ వంతం అయ్యింది. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ ప్రైవేట్ స్పేస్‌టెక్ స్టార్టప్ 'స్కైరూట్ ఏరోస్పే 'విక్రమ్-1' రాకెట్ రూపొందించింది. శ్రీహరికోటలోని సతీష్ ధవన్ అంతరిక్ష కేంద్రం(షార్) నుంచి శనివారం మధ్యాహ్నం 12:05 గంటలకు చేపట్టిన మిగతా2లో...

# గాంధీ జయంతి నాటికి చెత్తకు మోక్షం

## - చెత్తనుంచి సంపద సృష్టించడమే మా లక్ష్యం



- తడి, పొడి చెత్తను ఇంట్లోనే వేరు చేయాలి
- ఘన వ్యర్థాల ప్రాసెసింగ్ కేంద్రాల కోసం రూ.528 కోట్లు ఖర్చు
- రౌడీయిజం చేసేవారిని ఉపేక్షించబోమని హెచ్చరిక
- గుడివాడ స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో చంద్రబాబు

**విజయవాడ,మన జనప్రగతి జూలై 18:** రాష్ట్రంలో అక్టోబర్ 2 గాంధీ జయంతి నాటికి చెత్తలేకుండా చేస్తామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. చెత్త నుంచి సంపద సృష్టించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. గుడివాడలో జరిగిన స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గుంటూరు, నెల్లూరు నగరాల్లో చెత్త సేకరణకు ఉపయోగించే.. ఎలక్ట్రిక్ ఆటోలను వర్చువల్‌గా ప్రారంభించారు. బాగా పని చేసిన వారికి పురస్కారాలను ప్రదానం చేశారు. ఇంట్లో ఎవరికి వారే.. తడి, పొడి చెత్తను వేరు చేసుకోవాలని మిగతా2లో...




# గాంధీ జయంతి నాటికి చెత్తకు మోక్షం

(మొదటి పేజీ తరువాయి)

చంద్రబాబు పిలుపునిచ్చారు. మే 23 నుంచి జూన్ 20 వరకు ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమం చేపట్టాం. ఆగస్టు 26 నాటికి 1140 ఈ-ఆటోలు అందుబాటులోకి వస్తాయి. 108 సమగ్ర ఘన వ్యర్థాల ప్రాసెసింగ్ కేంద్రాల కోసం రూ.528 కోట్లు ఖర్చు చేస్తున్నాం. 'ప్రజారథం' కార్యక్రమం ద్వారా చెత్తను కొనుగోలు చేసి.. నిత్యావసర వస్తువులు అందజేశాం. దీనికోసం ఇప్పటి వరకు రూ.16 కోట్లు ఖర్చు చేశాం. చెత్త నుంచి సంపద సృష్టించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం అని చంద్రబాబు అన్నారు. ఎవరి ఇంటిపై వాళ్లే కరెంటు తయారు చేసుకోవాలని పిలుపునిచ్చారు. కాలుష్యం మన ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. చెత్త నిర్వహణలో ప్రతి కుటుంబం భాగస్వామ్యం కావాలని సూచించారు. ఇంట్లోనే తడి, పొడి చెత్తలను వేరు చేసుకోవాలని తెలిపారు. తడి చెత్తను కంపోస్ట్‌గా తయారు చేసుకోవాలని పేర్కొన్నారు. ఏపీలో అక్టోబర్ 2వ తేదీ నాటికి చెత్తలేకుండా చేస్తామని చెప్పారు. ఈ నెలలోనే తల్లికి వందనం కింద డబ్బులు వేస్తామని వెల్లడించారు. అంగన్ వాడీ కార్యకర్తలు, స్వచ్ఛాంధ్రప్రదేశ్‌లో పనిచేసే కార్మికులకు తల్లికి వందనం అమలు చేస్తామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. రౌడీయిజం చేస్తే ఎవరినీ వదిలిపెట్టనని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హెచ్చరించారు. అమృత్ 2.0 శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. స్వర్ణ పంచాయతీ ఉద్యోగులకు స్వచ్ఛ అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు ప్రసంగించారు. గొడ్డలి పార్టీతో పెద్ద సమస్య వచ్చిందని తెలిపారు. రాష్ట్రంలో కొందరు క్రిమినల్స్‌గా మారారని చెప్పుకొచ్చారు. మాజీ మంత్రి కొడుకు యాక్సిడెంట్ చేస్తే ఓ వ్యక్తి చనిపోయాడని తెలిపారు. పోస్టర్లు, కటౌట్‌లకు పొట్టేళ్లను బలి ఇస్తున్నారని ధ్వజమెత్తారు. గుడివాడలో జరిగిన స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న సీఎం చంద్రబాబుకు తమ వంతు విరాళాలను అందించారు. అమరావతి కోసం గుడివాడకు చెందిన సాయిశ్వేత బంగారు గాజులు అందించారు. ఆమె కుమారుడు దాచుకున్న కిడ్డీ బ్యాంక్ నగదును కూడా అమరావతి అభివృద్ధికి వినియోగించాలని కోరారు. మరోవైపు గుడివాడ ఆర్టీసీ బస్టాండ్ అభివృద్ధి కోసం అన్నే నరసింహారావు, పుష్ప లీలావతి దంపతులు రూ.3 కోట్ల విరాళం ఇచ్చారు. గతంలోనూ వారు గుడివాడ ప్రభుత్వ ఆస్పత్రికి రూ.3 కోట్లు విరాళం ఇచ్చారు.

# భారత అంతరిక్ష రంగంలో సరికొత్త అధ్యాయం

(మొదటి పేజీ తరువాయి)

ఈ ప్రయోగం విజయవంతమైంది. దీంతో ప్రభుత్వ ఆధ్వర్యంలోని అంతరిక్ష కార్యక్రమాలు సహా భారత ప్రైవేటు రంగం కూడా ఉపగ్రహాలను కక్ష్యలోకి పంపగల సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటినట్లు అయ్యింది. వాస్తవానికి ఉదయం 11.30 గంటలకు ప్రయోగం జరగాల్సి ఉండగా సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో ప్రయోగానికి స్వల్ప అంతరాయం ఏర్పడింది. ఆ తర్వాత శాస్త్రవేత్తలు పరిశీలనలు చేపట్టి ఇంధన ప్రక్రియలో తలెత్తిన సమస్యను గుర్తించి సరిచేశారు. 35 నిమిషాల తర్వాత తిరిగి రాకెట్‌ను ప్రయోగించారు. ఈ రాకెట్.. సాంకేతిక పేలోడ్‌లు సహా ప్రధాని నరేంద్ర మోదీ స్వహస్తాలతో 'వందేమాతరం' అని రాసి పంపిన ప్రత్యేక పోస్ట్‌కార్డును అంతరిక్షంలోకి తీసుకెళ్లింది. వీటితో పాటు కాస్మోస్ డైమండ్స్ సంస్థ రూపొందించిన 'కాస్మిక్ బ్లూమ్' ఆర్ట్‌వర్క్, విక్రమ్-1 రాకెట్ సూక్ష్మ ప్రతిరూపాన్నీ నింగిలోకి పంపారు. దీనిపై సర్ సీవీ రామన్, విక్రమ్ సారాభాయ్, ఏపీజే అబ్దుల్ కలాం వంటి ప్రముఖుల సూక్ష్మరూపాలను చెక్కారు. అంతేకాకుండా.. ఈ ప్రయోగం విజయవంతం కావాలని కాంక్షిస్తూ స్కైరూట్ టీమ్ సహా ఇస్రో మాజీ ఛైర్మన్లు, శాస్త్రవేత్తలు, భారతీయ వ్యోమగాములు, ఇతరులు పంపిన డజన్ల కొద్దీ చేతిరాత పోస్ట్‌కార్డులనూ ప్రత్యేక పేలోడ్ బాక్స్‌లో భద్రపరిచారు. స్కైరూట్ సంస్థ 'మిషన్ ఆగమన్' పేరిట ఈ ప్రయోగం చేపట్టింది. భారత ప్రైవేట్ అంతరిక్ష రంగం ఆర్బిటాల్ ప్రయోగాల యుగంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ఈ మిషన్‌కు ఆ పేరు పెట్టింది. విక్రమ్-1 ద్వారా గ్రహాస్పేస్, కాస్మోసెర్వ్, డీక్యూబ్‌డ్ సంస్థలకు చెందిన టెక్నాలజీ డెమానిస్ట్రేషన్ పేలోడ్‌లు సహా స్కైరూట్‌కు చెందిన 'స్కోప్'ను కూడా అంతరిక్షంలోకి పంపారు. ఈ ప్రయోగం ద్వారా రాకెట్‌లోని ప్రొపల్షన్, స్టేజ్ సెపరేషన్, గైడెన్స్, నావిగేషన్, కంట్రోల్ వ్యవస్థల పనితీరును అంతరిక్ష ప్రయాణంలో పరీక్షించి తద్వారా కీలక సమాచారం రాబట్టనున్నారు. దీంతో రానున్న కాలంలో వాణిజ్య ప్రయోగాల అవసరాలకు సాంకేతిక సామర్థ్యాన్ని మరింత మెరుగుపరుచుకోవడమే లక్ష్యంగా స్కైరూట్ ముందడుగేస్తోంది. ఇక.. సుమారు ఏడంతస్తుల భవనం ఎత్తులో రూపొందిన విక్రమ్-1 పూర్తిగా కార్బన్ కాంపోజిట్ నిర్మాణంతో తయారైంది. దేశీయంగా అభివృద్ధి చేసిన 3డీ ప్రింటెడ్ ఇంజిన్లు, ఘన ఇంధన బూస్టర్లతో పనిచేసే ఈ రాకెట్ 350 కిలోల వరకు చిన్న ఉపగ్రహాలను 450 కిలోమీటర్ల ఎత్తులోని లోఎర్త్ ఆర్బిట్ లో ప్రవేశపెట్టే సామర్థ్యాన్ని కలిగి ఉంది. 2022లో విక్రమ్-ఎస్ ద్వారా తొలి ప్రైవేట్ రాకెట్‌ను విజయవంతంగా కక్ష్యలోకి పంపిన స్కైరూట్.. ఇప్పుడు విక్రమ్-1తో తొలి దేశీయ ప్రైవేట్ ఆర్బిటాల్ ప్రయోగం చేపట్టింది. ఈ ప్రయోగాన్ని ఏపీ మంత్రి నారా లోకేశ్ ప్రత్యక్షంగా వీక్షించారు. కుమారుడు దేవాన్ష్‌తో కలిసి శ్రీహరికోటకు వెళ్లిన లోకేశ్.. ఇస్రో గ్యాలరీ నుంచి 'విక్రమ్-1' ప్రయోగాన్ని వీక్షించారు. ఇస్రో మాజీ ఛైర్మన్లు, సీనియర్ శాస్త్రవేత్తలు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# జాతీయ చలనచిత్ర అవార్డుల ప్రకటన

**న్యూఢిల్లీ,మన జనప్రగతి జూలై 18:**72వ జాతీయ చలనచిత్ర పురస్కారాల్లో తెలుగు చిత్రాలు అదరగొట్టాయి. 2024 సంవత్సరానికి గానూ వివిధ కేటగిరీల్లో పలు తెలుగు చిత్రాలకు అవార్డులు దక్కాయి. ఉత్తమ ప్రాంతీయ చిత్రంగా 'కమిటీ కుర్రోళ్ళు' ఎంపికైంది. అంతేకాదు, ఉత్తమ మేకప్ విభాగంలోనూ అవార్డు వరించింది. కొత్త నటులతో దర్శకుడు యదువంశీ రూపొందించి ఈ చిత్రానికి మెగా డాటర్ నిహారిక కొణిదెల నిర్మాతగా వ్యవహరించడం విశేషం. బాక్సాఫీస్‌తో పాటు ఓటీటీలోనూ అదరగొట్టిన ఈ మూవీ ఇప్పుడు ఏకంగా రెండు జాతీయ అవార్డులను సొంతం చేసుకుంది. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన గద్దర్ అవార్డుల్లో జాతీయ సమైక్యత, మతసామరస్యం, అణగారిన వర్గాల సామాజిక అభ్యున్నతికి ఉద్దేశించిన చిత్రంగా వివిధ విభాగాల్లో మెరిసింది. ఇక నాగ్ అశ్విన్ విజువల్ వండర్ 'కల్కి 2898 ఏడీ'కి రెండు కేటగిరీల్లో అవార్డులను దక్కించుకుంది. అద్భుతమైన సెట్స్, విజువల్స్‌తో అలరించినందుకు ఉత్తమ ప్రొడక్షన్ డిజైన్ అవార్డుతో పాటు, ఉత్తమ ప్రజాదరణ పొందిన చిత్రంగా జాతీయ అవార్డును సొంతం చేసుకుంది. 'ఎంత గొప్పగా ఆడావు అన్నది ముఖ్యం కాదు.. ఎప్పుడు ఆపావన్నదే ముఖ్యం, 'ఒక్క రోజులో ఒక అరగంట నాకు నచ్చినట్టు గడవలేదు. దానికి జీవితాంతం ఏడుస్తూ కూర్చోలేను కదా' వంటి సంభాషణలతో అలరించిన చిత్రం 'లక్కీ భాస్కర్'. ఇలాంటి అద్భుతమైన సంభాషణలను రాసి జీవిత సత్యాలెన్నో చెప్పిన దర్శకుడు వెంకీ అట్లూరి ఉత్తమ రచయితగా జాతీయ అవార్డు దక్కింది. మాస్‌నే కాదు, బాక్సాఫీస్‌ను ఓ ఊపు ఊపేసిన చిత్రం 'పుష్ప2'. ఇప్పుడు ఏకంగా రెండు జాతీయ అవార్డులను సొంతం చేసుకుంది. ఈ మూవీని ఆద్యంతం అలరించేలా తీర్చిదిద్దిన దర్శకుడు సుకుమార్ ఉత్తమ స్క్రీన్‌ప్లే రచయిత కేటగిరిలో అవార్డుకు ఎంపిక కాగా, ఉత్తమ కాస్ట్యూమ్ డిజైనర్‌గా దీపాలి నూర్, సీతల్ శర్మలకు అవార్డు దక్కింది. చిన్న చిత్రం కాదు.. ప్రతి ఒక్కరి మనసుల్ని హత్తుకునేంత పెద్ద చిత్రమనించింది '35- చిన్న కథ కాదు'. ఇప్పుడు జాతీయ అవార్డుల్లో ఉత్తమ బాలల చిత్రంతో పాటు, ఉత్తమ బాల నటుడిగా అరుణ్‌దేవ్ పోతుల అవార్డుకు ఎంపికయ్యారు.

# పర్యాటక రంగంలో పెట్టుబడులకు ఏపీ అత్యంత సురక్షితం

- పర్యాటక మంత్రి కందుల దుర్గేష్
- "ఆల్ ఇండియా చాప్టర్ ఛైర్మన్ల సమావేశం 2026"కు ముఖ్య అతిథిగా మంత్రి
- సింగిల్ విండో విధానం ద్వారా శరవేగంగా పర్యాటక అనుమతులు




**అమరావతి,మన జనప్రగతి జూలై 18:**భారతదేశ దేశీయ పర్యాటక రంగ అభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అత్యంత కీలకమైన భూమిక పోషిస్తోందని, పర్యాటక రంగాన్ని ఒక వ్యూహాత్మక ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. శనివారం న్యూఢిల్లీలోని చాణక్యపురి 'హోటల్ జింజర్' వేదికగా అసోసియేషన్ ఆఫ్ డొమెస్టిక్ టూర్ ఆపరేటర్స్ ఆఫ్ ఇండియా నిర్వహించిన "ఆల్ ఇండియా చాప్టర్ ఛైర్మన్ల సమావేశం 2026"కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. "స్వదేశీ పర్యటన్ ? సశక్త్ భారత్" అనే ప్రధాన ఇతివృత్తంతో.. ఆంధ్రప్రదేశ్ మరియు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలపై ప్రత్యేక ఫోకస్‌తో జరిగిన సదస్సు లో మంత్రి దుర్గేష్ కీలక ప్రసంగం చేశారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ, పర్యాటకరంగ సేవల్లో 30 ఏళ్లు పూర్తి చేసుకున్న ఎడిటిఓఐ సంస్థకు అభినందనలు తెలిపారు. దేశవ్యాప్తంగా 2,400 మందికి పైగా సభ్యులతో విస్తరించిన ఈ జాతీయ నెట్‌వర్క్, భారతీయ పర్యాటక రంగాన్ని ముందుకు నడిపించడంలో కీలక పాత్ర పోషిస్తోందని కొనియాడారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల దూరదృష్టితో కూడిన నాయకత్వంలో, రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేం దుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా కల్పించామని, పబ్లిక్-ప్రైవేట్ పార్టనర్‌షిప్ పద్ధతిలో పెట్టుబడులను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. విశాఖపట్నం, అరకు లోయ, రాజమహేంద్రవరం, అమరావతి, శ్రీశైలం, గండికోట, తిరుపతిలను ఏడు ప్రధాన పర్యాటక హబ్‌లుగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఆధ్యాత్మికం, తీరప్రాంతం (కోస్టల్), పర్యావరణం (ఎకో), బౌద్ధ వారసత్వం, గ్రామీణ సంస్కృతి కలగలిసిన అరుదైన పర్యాటక అనుభూతి ఆంధ్రప్రదేశ్ సొంతమని పేర్కొన్నారు. తిరుపతి, శ్రీశైలం వంటి దివ్యక్షేత్రాల నుండి అరకు లోయ అందాలు, గండికోట గ్రాండ్ కాన్యన్, బెలుం గుహల వరకు ఎన్నో అద్భుతాలు రాష్ట్రంలో ఉన్నాయన్నారు. పర్యాటక రంగం కేవలం పెద్ద నగరాలకే పరిమితం కాకుండా గ్రామాలు, తీరప్రాంతాలు, గిరిజన ప్రాంతాల వరకు విస్తరించి మహిళలకు, యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తుందని, స్థానిక వంటకాలు మరియు చేతివృత్తులకు ప్రాచుర్యం తెస్తుందని మంత్రి దుర్గేష్ నొక్కి చెప్పారు.

# ఆయిల్ పామ్ కోసం ఏకమవుదాం



**హైదరాబాద్,మన జనప్రగతి జూలై 18:** కేంద్రంపై ఉమ్మడిగా ఒత్తిడికి దక్షిణాది రాష్ట్రాల వ్యవసాయ మంత్రులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లేఖ రాశారు. ఆయిల్ పామ్ రైతుల కోసం దక్షిణాది రాష్ట్రాలు ఏకమవ్వాలని కోరారు. ప్రధాని మోదీని కలిసి ఆయిల్ పామ్ రైతుల సమస్యలు వినిపిద్దామన్నారు. ఆయిల్ పామ్‌కు కనీస హామీ ధర రూ.25 వేలుగా నిర్ణయించా లని డిమాండ్ చేశారు. లేదంటే క్రూడ్ పామ్ ఆయిల్ దిగుమతి సుంకాన్ని 44 శాతానికి పునరుద్ధరించాలన్నారు. దిగుమతి సుంకాల తగ్గింపుతో రైతులకు భారీ నష్టం వాటిల్లుతోందని మంత్రి తెలిపారు. దేశ ఆయిల్ పామ్ సాగులో 75 శాతం వాటా దక్షిణాది రాష్ట్రాలదే అని చెప్పుకొచ్చారు. రైతులకు స్థిర ఆదాయం కోసం కేంద్రం తక్షణ జోక్యం అవసరమన్నారు. వంటనూనెల స్వయం సమృద్ధి లక్ష్యానికి రైతుల రక్షణ కీలకమన్నారు. ఆయిల్ పామ్ రైతుల ప్రయోజనాల కోసం దక్షిణాది రాష్ట్రాలు కలిసిరావాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు.

# ఎటపాక మండలం గొల్లగూడెం వద్ద తీవ్ర విషాదం

## - చేపలవేటకు వెళ్లిన ఐదుగురు మృతి



**పోలవరం,మన జనప్రగతి జూలై 18::** ఎటపాక మండలం గొల్లగూడెం వద్ద తీవ్ర విషాదం చోటుచేసుకుంది. గోదావరిలో చేపల వేటకు వెళ్లి ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. మృతిచెందిన వారిని ఊకె సుశీల(37), ఊకె లక్ష్మి(37), తుర్రం భారతి(40), భాసుబోయిన బాలరాజు (38), ఊకె రమేశ్ (38)గా పోలీసులు గుర్తించారు. వారంతా గొమ్ము కొత్తగూడెం గ్రామ వాసులుగా వెల్లడించారు. బాధితులంతా చేపలు పట్టేందుకు గోదావరి నదిలోకి వెళ్లారు. అయితే, ప్రమాదవశాత్తూ వారంతా గల్లంతయ్యారు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. స్థానికుల సహాయంతో గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. చివరికి వారిని విగతజీవులుగా బయటకు తీశారు. ఈ ఘటనతో గొమ్ము కొత్తగూడెంలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. బాధిత కుటుంబాల సభ్యులు ఘటనా స్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

# పవన్ కళ్యాణ్‌కు లోకేశ్ పరామర్శ



**హైదరాబాద్,మన జనప్రగతి జూలై 18:**కుడి భుజానికి శస్త్రచికిత్స చేయించుకున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను మంత్రి నారా లోకేశ్ పరామర్శించారు. హైదరాబాద్ నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న పవన్‌ను కలిసిన ఆయన.. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. వైద్యుల సూచనలు పాటించి విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. ఇటీవల ముంబయిలోని కోకిలాబెన్ ధీరూభాయ్ అంబానీ ఆస్పత్రిలో పవన్ కళ్యాణ్ శస్త్రచికిత్స చేయించుకున్న సంగతి తెలిసిందే. ఆర్థోపెడిక్ సర్జన్, స్పోర్ట్స్ మెడిసిన్ నిపుణులు డాక్టర్ దిన్షా పార్థీవాలా నేతృత్వంలో వైద్యుల బృందం పవన్ కుడి భుజానికి సర్జరీ చేసింది.

# 'విక్రమ్-1' విజయవంతంపై ప్రధాని మోడీ హర్షం

- స్కైరూట్ ఏరోస్పేస్ బృందానికి ఫోన్‌లో అభినందనలు
- ఇంజనీర్ల కృషిని ప్రశంసిస్తూ..తనను కలవాలని సందేశం



**న్యూఢిల్లీ,మన జనప్రగతి జూలై 18:** భారత తొలి ప్రైవేటు అంతరిక్ష ప్రయోగం 'విక్రమ్-1' విజయవంతం కావడంపై ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. ప్రయోగం విజయవంతమైన వెంటనే హైదరాబాద్‌కు చెందిన స్కైరూట్ ఏరోస్పేస్ బృందంతో ఫోన్‌లో మాట్లాడి, వారికి ప్రత్యేక అభినందనలు తెలిపారు మోదీ. ఈ ప్రయోగాన్ని తాను ప్రత్యక్షంగా వీక్షించినట్టు చెప్పిన ఆయన.. ఈ ఘనత దేశానికి గొప్ప విజయమని అభివర్ణించారు. భారత అంతరిక్ష ప్రయాణంలో ఇదో కీలక మైలురాయిగా నిలిచిందని పేర్కొన్నారు. 'ప్రయోగాన్ని నేను ప్రత్యక్షంగా వీక్షించాను. దీని వెనుక ఎందరో యువ ఇంజినీర్ల శ్రమ దాగుంది. మొత్తం బృందానికి నా హృదయపూర్వక అభినందనలు. ఇది ఆరంభం మాత్రమే. ఈ ప్రయాణాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలి' అని స్కైరూట్ టీమ్‌ను ప్రోత్సహించారు. ఈ సందర్భంగా స్కైరూట్ ఏరోస్పేస్ శాస్త్రవేత్తలు, ఇంజినీర్ల బృందం త్వరలో తనను కలవాలని ఫోన్ ద్వారా ఆహ్వానించారు. అంతరిక్ష రంగంలో భారత్ స్వావలంబన దిశగా వేగంగా ముందుకు సాగుతోందని ఈ ప్రయోగం ప్రపంచానికి చాటిచెప్పిందని మోదీ అభిప్రాయపడ్డారు. 'అంతరిక్ష రంగంలోనూ భారత్ ఆత్మనిర్భర్‌గా ఎదగగలదని మీరు ప్రపంచానికి నిరూపించారు' అని ప్రధాని కొనియాడారు. 'విక్రమ్-1'లో తన 'వందేమాతరం' సందేశంతో కూడిన కార్డును కూడా పంపించిన విషయాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. ప్రపంచం నలుమూలల నుంచి వచ్చిన శుభాకాంక్షలు సహా ఆ సందేశం కూడా అంతరిక్షంలోకి చేరడం గర్వకారణమన్నారు. 'ఈ ప్రయోగం ద్వారా 'వందేమాతరం' సందేశం మరింత ఉన్నత స్థాయికి చేరి అంతరిక్షంలోనూ మార్మోగింది' అని మోదీ వ్యాఖ్యానించారు. శ్రీహరికోటలోని సతీష్ ధవన్ అంతరిక్ష కేంద్రం నుంచి శనివారం మధ్యాహ్నం 12:05 గంటలకు 'మిషన్ ఆగమన్' పేరిట చేపట్టిన 'విక్రమ్-1' రాకెట్ విజయవంతంగా నింగిలోకి దూసుకెళ్లింది. నిర్ణీత సమయం కంటే 35 నిమిషాలు ఆలస్యంగా ప్రయోగం చేపట్టినప్పటికీ.. అన్ని దశలను విజయవంతంగా పూర్తి చేయడంతో భారత ప్రైవేటు అంతరిక్ష రంగంలో కొత్త అధ్యాయానికి నాంది పలికింది.


# పరిశుద్ధతే ప్రాధాన్యత.. పచ్చదనమే ప్రగతి

- స్వచ్ఛ ఆంధ్రస్వర్ణాంధ్ర కార్యక్రమంలో మొక్కలు నాటిన నాయకులు
- పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి



**ఆస్పరి మన జనప్రగతి జూలై 18:**-రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన "స్వచ్ఛ ఆంధ్రస్వర్ణాంధ్ర" కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆలూరు టీడీపీ ఇన్‌ఛార్జ్ వైకుంఠం జ్యోతి పిలుపునిచ్చారు. ఆమె పిలుపు మేరకు శనివారం ఆస్పరి మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొని పరిశుభ్రత, పచ్చదనంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యతను చాటుకున్నారు. రాబోయే తరాలకు స్వచ్ఛమైన, పచ్చని వాతావరణాన్ని అందించాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని నాయకులు సూచించారు. పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ వెంకటేశు, డైరెక్టర్ సుదర్శన్ కృష్ణ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నీలకంఠేశ్వర ఆలయంలో 20 అడుగుల అభయ ఆంజనేయస్వామి విగ్రహ ఆవిష్కరణ



**సిద్ధవటం మన జనప్రగతి జూలై 18:**-మండలంలోని కనుమలోపల్లె గ్రామ సమీపంలోని కడపచెన్నై జాతీయ రహదారి పక్కన వెలసిన శ్రీ ఉమాదేవి సమేత నీలకంఠేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో 20 అడుగుల శ్రీ అభయ ఆంజనేయస్వామి విగ్రహాన్ని శనివారం వైభవంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకం, గణపతి పూజ, ఆకు పూజ నిర్వహించగా, భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఆలయ ట్రస్ట్ అధినేత సోమా బాబు మాట్లాడుతూ, కడపకు చెందిన ఎన్నారై బాపనపల్లి మధుసూదన్ రూ.5 లక్షల వ్యయంతో ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేయించి భక్తులకు అందుబాటులోకి తీసుకొచ్చారని తెలిపారు. మధుసూదన్ మాట్లాడుతూ, తన తండ్రి కీర్తిశేషులు శివయ్య జ్ఞాపకార్థం విగ్రహాన్ని ప్రతిష్ఠించామని, భవిష్యత్తులో ఆలయ అభివృద్ధికి కూడా సహకరిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి చైతన్య శర్మ, బాపనపల్లి జ్యోతి, జశ్విత‌తో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ప్రాజెక్టు పురోగతి పనుల పరిశీలన



**కర్నూలు బ్యూరో మన జనప్రగతి జూలై 18:**-గుట్టపాడు సమీపంలో అభివృద్ధి చెందుతున్న నేషనల్ ఇండస్ట్రియల్ కానేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ప్రాజెక్టు పనుల పురోగతిపై రిడార్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ప్రాజెక్టు పనుల కేంద్ర బృందం సభ్యులు పరిశీలించారు. శనివారం పురోగతిపై కాంట్రాక్టర్లు, అధికారులతో సమీక్ష నిర్వహించిన కేంద్ర వాణిజ్య,పరిశ్రమల మంత్రిత్వశాఖ, డిపార్ట్‌మెంట్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్ సెక్రటరీ అమర్‌దీప్ సింగ్ భాటియా, ఐ ఏ ఎస్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పరిశ్రమలు, వాణిజ్య మరియు ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ కార్యదర్శి డా.ఎన్.యువరాజ్, ఐ ఏ ఎస్, నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ రజత్ కుమార్ సైనీ ఐ ఏ ఎస్, ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ దినేష్ కుమార్ ఐ ఏ ఎస్, జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి, ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ఈడి యశ్వంత్ కుమార్ రెడ్డి, ఐఏఎస్, ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ చీఫ్ ఇంజనీర్ హరిధర్, తదితరులు కలిసి పరిశీలించారు. అనంతరం గుట్టపాడు సమీపంలోని ఏపీఐసిడిసి కార్యాలయం పరిధిలో ఐఏఎస్ అధికారులు మొక్కలు నాటారు.

# నూతన మున్సిపల్ కమిషనర్‌కు వైకాపా నేతల శుభాకాంక్షలు



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి జూలై 18:**పులివెందుల పురపాలక నూతన కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన ఎం.ఎస్.తనుజ కు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ (వైకాపా) నాయకులు ఘనంగా శుభాకాంక్షలు తెలిపారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలోని ఆమె ఛాంబర్‌లో నేతలు కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకుని, పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలియజేశారు. గ్రూప్-1 విభాగంలో ఉత్తీర్ణత సాధించి,పులివెందుల మున్సిపల్ కమిషనర్‌గా నియమితులైన తనుజ ఆధ్వర్యంలో పట్టణం మరింత అభివృద్ధి చెందాలని వైకాపా నేతలు ఆకాంక్షించారు. పులివెందుల మున్సిపాలిటీ సర్వతోముఖాభివృద్ధికి శ్రమించాలని ఈ సందర్భంగా ఆమెను కోరారు. ఇంచార్జ్ స్థానంలో పూర్తిస్థాయి బాధ్యతలు ఇప్పటివరకు మున్సిపల్ విభాగంలో రెవెన్యూ అధికారిగా విధులు నిర్వహిస్తూ,ఇంచార్జ్ కమిషనర్‌గా కొనసాగిన మునికుమార్ స్థానంలో ఎం.ఎస్.తనుజ పూర్తిస్థాయి కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వైకాపా మైనారిటీ నేతలు నూరుల్లా, ఓ.రసూల్,జయరాం,రాజు, బాబావలి,వెంకటస్వామితో పాటు ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలను తరలించడం అన్యాయం: ఏఐఎస్ఎఫ్,ఏఐవైఎఫ్

**పత్తికొండ మన జనప్రగతి జులై 18:** విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో చదువుల రామయ్య భవనం నుండి ర్యాలీగా బయలుదేరి నాలుగు స్తంభాల కూడలి దగ్గర ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగినది ఈ కార్యక్రమానికి అధ్యక్షతన ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి సిద్ద లింగప్ప అధ్యక్షత నిర్వహించడం జరిగినది ఈ కార్యక్రమానికి ముఖ్య నాయకులుగా జిల్లా ఉపాధ్యక్షులు హనుమేష్ గారు ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు నజీర్ మాట్లాడుతూ పత్తికొండ నియోజకవర్గం నుండి మహాత్మ జ్యోతిరావు పూలే బాలురుల గురుకుల పాఠశాల మంజూరు అయ్యింది అయితే పత్తికొండ ఎడ్ కోటర్ లో ఏర్పాటు చేయాల్సిన ఎమ్మెల్యే గారి తన స్వంత గ్రామం అయినటువంటి కంబలపాడు కు తీసుకుపోవడం చాలా దారుణం అని వారు అన్నారు ఇక్కడ ప్రజలతో ఓట్లు వేయించుకొని దాదాపు మూడు మండలాల నుంచి అనేకమంది పత్తికొండకు రాకపోకలు సాగిస్తూ ఉంటారు ఇక్కడ ప్రజలతో ఓట్లు





వేయించుకొని ఇక్కడ అభివృద్ధి చేస్తామంటూ వాళ్ళ స్వంత గ్రామాల్లో మండలాలు కేంద్రాల్లో అభివృద్ధి చేసుకుంటూ నియోజకవర్గం పేరు చెప్పుకొని అర్హత లేనటువంటి నాయకులు ఈరోజు నియోజకవర్గం అని ఉండే విద్యాసంస్థలన్నీ వారి సొంత గ్రామాలు మండలానికి తీసుకువెళ్లి అభివృద్ధి చేసుకుంటున్నారు తప్ప పత్తికొండ నియోజకవర్గం లేదు ఇక్కడి నాయకులు ఇంత చేస్తున్న నిమ్మకనీరెట్ల ఉండడం అవమానకరంగా భావిస్తున్నాం తక్షణమే పత్తికొండ నియోజకవర్గం లో ఏర్పాటు మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాల ఏర్పాటు చేసేంతవరకు విద్యార్థి యువజన సంఘాలుగా పోరాడడానికి సిద్ధమవుతామని రాబోయే రోజుల్లో రాస్తారోకో మరిన్ని ఉద్యమాలకు విద్యాసంస్థల బంద్ కూడా పిలుపునివ్వడానికి సంసిద్ధంగా ఉంటామని కలిసి వచ్చే ప్రజా సంఘాలతో కలుపుకొని వెళ్లి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని డిమాండ్ చేయడం జరిగినది ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి శివ ఏఐవైఎఫ్ నాయకులు అల్తాఫ్ రవి ఇమ్రాన్ నిషార్ ఏఐఎస్ఎఫ్ నాయకులు సంతోష్ బాబు రాజులు పాల్గొన్నారు

# మత్తు పదార్థాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలి.

- పల్లె బాటలో ఈగల్ అవగాహనా కార్యక్రమం నిర్వహిస్తాం
- జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి, ఎస్పీ విక్రాంతపాటిల్.

**కర్నూలు బ్యూరో మన జనప్రగతి జూలై 18:**-జిల్లాలో మత్తు పదార్థాల వినియోగం, అక్రమ రవాణా మరియు విక్రయాలను అరికట్టేందుకు అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన నార్కోటిక్స్ కోఆర్డినేషన్ ఎన్‌కార్డ్ -కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షత వహించి మత్తు పదార్థాల నియంత్రణకు చేపడుతున్న చర్యలను సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యువత దేశ భవిష్యత్తు అని, మాదక ద్రవ్యాల వ్యసనం వారి జీవితాలను , కుటుంబాలను , సమాజంపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. జిల్లాలో గంజాయి, మాదక ద్రవ్యాలు, నిషేధిత మత్తు పదార్థాల అక్రమ రవాణా, నిల్వలు, విక్రయాలపై నిరంతర నిఘా కొనసాగించాలని పోలీసు, ఎక్సైజ్, విద్యాశాఖ, వైద్య ఆరోగ్యశాఖ మరియు ఇతర అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. జిల్లాలో విద్యాసంస్థలలో మరియు పరిసరాలలో విద్యాశాఖ అధికారులు మత్తు పదార్థాల వినియోగం జరగకుండా నిఘా ఉంచాలని ఆదేశించారు. సంఘటనలు జరిగినచో వారిని బాధ్యులుగా చేస్తామని తెలిపారు. ప్రజలు అధికంగా రాకపోకలు సాగించే ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలు



నిర్వహించాలని, మత్తు పదార్థాల సరఫరా చేసే వ్యక్తులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మాదక ద్రవ్యాల నియంత్రణలో ప్రజల భాగస్వామ్యం కూడా ముఖ్యం అని, అనుమానాస్పద కార్యకలాపాలపై ప్రజలు నిఘా ఉంచి అధికారులకు సమాచారాన్ని అందించాలని కలెక్టర్ పేర్కొన్నారు. మత్తు పదార్థాలు సేవించినట్లు గుర్తించడానికి అవసరమైన యూరిన్ టెస్ట్ కిట్ లను నశాముక్తుభారత్ నిధుల నుంచి వెంటనే కొనుగోలు చేయాలని , ఎల్లప్పుడూ అవి నిలువ ఉంచుకోవాలని అందుకు సంబంధించిన కార్యాచరణ వెంటనే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ జిల్లాలో కొన్ని ప్రదేశాలలో రహస్యం గా గంజాయి సాగు చేయడం గుర్తించడం జరిగిందని , జిల్లా లోని వ్యవసాయ అధికారులు వీటిపై నిఘా ఉంచి పోలీసులకు తెలియజేయాలని కోరారు. గోనెగండ్ల లో ఇంటర్ విద్యార్థులు గంజాయి సేవించడం , గంజాయి కలిగి ఉండడం గుర్తించడం జరిగిందని , విద్యార్థులను వారి తల్లిదండ్రులను పిలిపించి చర్యలు తీసుకొని కౌన్సిలింగ్ చేయడం కూడా జరిగిందని తెలియజేశారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో డి-అడిక్షన్ సెంటర్ కు కావలసిన సిబ్బందిని మరియు బెడ్లను వెంటనే ఏర్పాటు చేయవలసిందిగా సంబంధిత అధికారులను కోరారు. ఏ.కే. రవికృష్ణ ,ఐజీపీ వారి ఆదేశాల మేరకు నూతన విద్యా సంవత్సరాన్ని పురస్కరించుకుని పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో ఈగల్ క్లబ్స్ ఏర్పాటు చేయడంతో పాటు, గ్రామీణ ప్రాంతాల్లో "పల్లె బాటలో ఈగల్ " అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలియజేసారు. ఈ కార్యక్రమం స్థానిక జిల్లా పోలీసులు మరియు ప్రజా ప్రతినిధుల సహకారంతో నిర్వహించబడుతుంది అని తెలిపారు. ప్రజలు తమ పరిసరాల్లో గంజాయి లేదా ఇతర మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారం ఉంటే ఈగల్ టోల్ ఫ్రీ నంబర్ 1972కు తెలియజేయాలి అన్నారు . సమాచారం అందించిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయి అని అన్నారు. సమావేశంలో జెడ్పి సి.ఈ.ఓ సుధాకర్ రెడ్డి, డిటిసి శాంతకుమారి,అడిషనల్ డీఎంహెచ్వో డా.భాస్కర్ , డి ఈ ఓ సుధాకర్, అబ్కారీ శాఖ సూపరింటెండెంట్ సుధీర్ బాబు , కర్నూల్ మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేసు, ఏపీఎస్ఆర్టీసీ ఆర్ఎం శ్రీనివాసులు , ఆర్ ఐ ఓ లాలెప్ప, డివి ఈవో సురేష్ బాబు , జి జి హెచ్ ఏ.ఓ సింధు సుబ్రహ్మణ్యం, డిసీ లేబర్ వెంకటేశ్వర్లు, జిల్లా ఎస్ సి , బి సి అధికారులు రాధిక, ప్రసూన, క్లస్టర్ యూనివర్సిటీ , కాలేజీలా అధికారులు, లీగల్ టీం ఎస్సై హనుమంత తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల సంక్షేమమే వార్డెన్ల బాధ్యత: కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి






**కర్నూలు మన జనప్రగతి జూలై 18:** వసతి గృహాల్లో విద్యార్థులకు మెరుగైన వసతులు, నాణ్యమైన ఆహారం, పరిశుభ్రమైన వాతావరణం కల్పించడం ప్రతి వార్డెన్ బాధ్యత అని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి అన్నారు. కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖల హాస్టల్ వార్డెన్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. విద్యార్థులను సొంత పిల్లల్లా భావించి వారి ఆరోగ్యం, భద్రత, విద్యాభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ప్రతి హాస్టల్‌లో క్రమశిక్షణతో పాటు పరిశుభ్రతను తప్పనిసరిగా పాటించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూను ఖచ్చితంగా అమలు చేసి నాణ్యమైన ఆహారం అందించాలని, హాస్టల్‌లలో ఆర్‌ఓ తాగునీరు, పరిశుభ్రమైన మరుగుదొడ్లు, అవసరమైన సౌకర్యాలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. విద్యార్థుల అనారోగ్యంపై వెంటనే స్పందించి అవసరమైతే తక్షణమే ఆస్పత్రికి తరలించాలని, తల్లిదండ్రులకు కూడా సమాచారం అందించాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థులతో ఎవరైనా అనుచితంగా ప్రవర్తించినా, విధుల్లో నిర్లక్ష్యం వహించినా కఠిన శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్టాక్ రిజిస్టర్లు, నిల్వల వివరాలను సక్రమంగా నిర్వహించాలని, హాస్టళ్ల నిర్వహణపై ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రైతులతో చర్చలు లేకుండా సోలార్ పనులు వద్ద హొసూరులో రైతు సంఘం హెచ్చరిక

- డిమాండ్లతో కంపెనీ అధికారులకు వినతిపత్రం

**పత్తికొండ మన జనప్రగతి జూలై 18:**-రైతులతో చర్చలు జరపకుండా, గ్రామసభ నిర్వహించకుండా సోలార్ ప్రాజెక్టు పేరుతో ఎలాంటి భూసేకరణ చేపట్టవద్దని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం డిమాండ్ చేసింది. పత్తికొండ మండలం హోసూరు గ్రామంలో శనివారం రైతు సంఘం ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఈ మేరకు తీర్మానించారు.

అనంతరం రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఈ. సిద్ధయ్య గౌడ్ నేతృత్వంలో రైతులు సోలార్ కంపెనీ ఫీల్డ్ అధికారులు నాగేంద్ర, సాయినాథ్‌లకు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ, రైతులతో కుదుర్చుకున్న లీజు ఒప్పందాల్లో అనేక లోపాలున్నాయని, వాటిని వెంటనే రద్దు చేసి రైతుల హక్కులకు భరోసా కల్పించేలా కొత్త ఒప్పందాలు రూపొందించాలని కోరారు. ప్రభుత్వం రైతుకంపెనీల మధ్య మధ్యవర్తిగా ఉండి రైతుల ప్రయోజనాలను పరిరక్షించాలని డిమాండ్ చేశారు. గ్రామసభ నిర్వహించి రైతుల ఆమోదం తీసుకున్న తర్వాతే ప్రాజెక్టు పనులు ప్రారంభించాలని స్పష్టం చేశారు. భూములపై రైతులకే పూర్తి హక్కులు ఉండేలా చర్యలు తీసుకోవాలని, లీజు కాలాన్ని ఐదేళ్లకు పరిమితం చేయాలని, ఎకరాకు రూ.50 వేల వార్షిక లీజుతో పాటు ప్రతి ఏడాది 15 శాతం పెంపు అమలు చేయాలని కోరారు. భూములపై కంపెనీలు ఎలాంటి రుణాలు తీసుకోకుండా నిబంధనలు రూపొందించాలని, వివాదాలు తలెత్తితే పత్తికొండ సివిల్ కోర్టులోనే పరిష్కరించుకునే అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. రైతుల డిమాండ్లను తమ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని కంపెనీ ప్రతినిధులు హామీ ఇచ్చారు. డిమాండ్లు నెరవేర్చకపోతే సోలార్ ప్రాజెక్టుల వల్ల నష్టపోయే రైతులతో కలిసి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని రైతు సంఘం నాయకులు హెచ్చరించారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు తిమ్మారెడ్డి, మధు, నాగేశ్వర్ రెడ్డి, అశ్వత్, వరదరాజులు, నరసింహారెడ్డి, పుల్లన్న, మునిస్వామి, చిరంజీవి, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

## పులివెందుల ట్రాఫిక్ ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన టి.గంగాధర్ రెడ్డి



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి జులై 18:-**పులివెందుల పట్టణ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ నూతన సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ)గా టి.గంగాధర్ రెడ్డి శనివారం అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు.కడప వీఆర్ నుంచి బదిలీపై ఆయన ఇక్కడికి బాధ్యతలు చేపట్టేందుకు వచ్చారు.ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ సిబ్బంది,తోటి అధికారులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికి, శుభాకాంక్షలు తెలియజేశారు.బాధ్యతలు స్వీకరించిన అనంతరం నూతన ఎస్ఐ గంగాధర్ రెడ్డి మీడియాతో మాట్లాడారు.పట్టణంలో ట్రాఫిక్ సమస్యల నియంత్రణకు తాము మొదటి ప్రాధాన్యత ఇస్తామని,ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు.పట్టణంలో ట్రాఫిక్ నిర్వహణను మరింత సమర్ధవంతంగా ముందుకు తీసుకెళ్లేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోనున్నట్లు ఆయన పేర్కొన్నారు.వాహన చోదకులు,ప్రజలు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను విధిగా పాటించి,పోలీసులకు పూర్తి స్థాయిలో సహకరించాలని ఆయన ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

## అంగరంగ వైభవంగా కోలాట గజ పూజ మహోత్సవం



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి జులై 18:**పులివెందుల మండల పరిధిలోని ఎర్రబల్లి పంచాయితీ హరిజనవాడలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి కోలాటం బృందం వారి గజ పూజ మహోత్సవం గ్రామ పంచాయతీలోని గ్రామ పెద్దల మరియు కోలాట గురువు నాగేంద్ర ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోలాట గజ పూజ మన సాంస్కృతిక మరియు ఆధ్యాత్మిక వైభవాన్ని అద్భుతంగా ప్రతిబింబిస్తుందని ఈ పండుగలు లేదా వేడుకల్లో భాగంగా కోలాటాలు,గజ పూజలు చేయడం మన తెలుగు రాష్ట్రాల్లో విశేషమైన ఆనవాయితీ గా ఉందని,దేవుని కళ్యాణాలు,ఆలయ బ్రహ్మోత్సవాలు, మరియు పండుగల సమయాల్లో మహిళలు భక్తి శ్రద్ధలతో,లయబద్ధమైన అడుగులతో కోలాటాలను అంగరంగ వైభవంగా ప్రదర్శిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో కోలాటం బృందం సభ్యులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## నూతన కమిషనర్‌ను కలిసిన టీడీపీ నాయకులు



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి జులై 18:-** పులివెందుల మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన యం.తనూజను శనివారం టీడీపీ నాయకులు మున్సిపల్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మున్సిపాలిటీ అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. నూతన కమిషనర్ కూడా ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ముచ్చుమర్రి చంద్ర మహేశ్వరరెడ్డి,పెదమర్ల మునివర్ధన్ యాదవ్,మాజీ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ మల్లెల శ్రీనువాసులు,చిన్నకుడాల సోసైటి డైరెక్టర్ పోదామల అబిలాష్ యాదవ్,భాజపా ఓబిసి జిల్లా నాయకుడు చాగంటి విష్ణు వర్ధన్ యాదవులు పాల్గొన్నారు.

## తనూజ్ పుట్టినరోజు సందర్భంగా నిరాశ్రయులకు అన్నదానం



**సిద్ధవటం మన జనప్రగతి జూలై 18:-**సిద్ధవటం మండలం మాధవరం-1 గ్రామానికి చెందిన మన ఊరి కోసం స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో, కొత్త బోయినపల్లి గ్రామానికి చెందిన కొర్రపాటి ఉమా మహేశ్వర్ నాగమణి దంపతుల కుమారుడు తనూజ్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా కడప నగరంలోని నవజీవన్ నిరాశ్రయుల వసతిగృహంలో వృద్ధులు, నిరాశ్రయులకు మధ్యాహ్నం, రాత్రి భోజనాలను అంద జేశారు. సంస్థ చైర్మన్ రవిశంకర్ మాట్లాడుతూ, తనూజ్ రెడ్డి ఆయురారోగ్యాలతో మరెన్నో పుట్టినరోజులు జరుపుకోవాలని, సమాజ సేవ పట్ల ఇదే స్ఫూర్తితో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. భవిష్య త్తులోనూ ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగించాలని పిలుపునిచ్చారు.

## సైన్స్, టెక్నాలజీలో అన్నమయ్య జిల్లాను అగ్రస్థానంలో నిలపాలి

- నాన్-లాంగ్వేజ్ ఉపాధ్యాయులకు జిల్లా స్థాయి ఓరియంటేషన్
- ఏఐ, డిజిటల్ బోధనపై ప్రత్యేక శిక్షణ



**పీలేరు మన జనప్రగతి జూలై 18:-**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ మండలి (ఎస్‌సీఈఆర్‌టీఈ) డైరెక్టర్ కృష్ణారెడ్డి ఆదేశాల మేరకు నాన్-లాంగ్వేజ్ ఉపాధ్యాయుల సామర్థ్యాభివృద్ధి కోసం అన్నమయ్య జిల్లాలో శుక్రవారం జిల్లా స్థాయి ఓరియంటేషన్ కార్యక్రమాలు నిర్వహించారు. మదనపల్లి, రాయచోటి, పీలేరు కేంద్రాల్లో జరిగిన ఈ శిక్షణలో పీలేరు కేంద్రంలో వివిధ సబ్జెక్టుల ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ అందించారు.పీలేరులోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో భౌతిక శాస్త్రం, జీవశాస్త్రం ఉపాధ్యాయులకు, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గణిత శాస్త్ర ఉపాధ్యాయులకు, కోటపల్లి జిల్లా పరిషత్ ఉన్నత బాలుర పాఠశాలలో సామాజిక శాస్త్ర ఉపాధ్యాయులకు ఓరియంటేషన్ నిర్వహించారు.ఈ కార్యక్రమాలను అన్నమయ్య జిల్లా డీసీఈబీ కార్యదర్శి గంగాధర్, జిల్లా సైన్స్ అధికారి గుండ్లూరు సుధీర్ కుమార్ సందర్శించారు. 6వ నుంచి 8వ తరగతి కొత్త పాఠ్యపుస్తకాల బోధన, దీక్ష యాప్ వినియోగం,ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్, కృత్రిమ మేధస్సు (ఏఐ) ఆధారిత బోధనపై ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు.జిల్లా సైన్స్ అధికారి గుండ్లూరు సుధీర్ కుమార్ మాట్లాడుతూ, ఉపాధ్యాయుల సహకారంతో సైన్స్, టెక్నాలజీ రంగాల్లో అన్నమయ్య జిల్లాను రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలిపేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఇన్‌స్పైర్ అవార్డు నామినేషన్లు, అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు, విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించే కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి-2 పద్మావతి, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు రేణుక, కోర్స్ డైరెక్టర్ కిరణ్మయి, డీఆర్‌పీలు, ఎస్ఆర్‌పీలు, సీఆర్‌పీలు, నాన్-లాంగ్వేజ్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పరిశుభ్రతలో అన్నమయ్య జిల్లా ఆదర్శంగా నిలవాలి: జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్



**అన్నమయ్య జిల్లా ప్రతినిధి మన జనప్రగతి జూలై 18:-**స్వర్ణాంధ్రస్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ప్రజల భాగస్వామ్యంతో అన్నమయ్య జిల్లాను పరిశుభ్రతలో ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ పిలుపునిచ్చారు. శనివారం రాయచోటి మున్సిపల్ పరిధిలోని శెట్టివారిపల్లి రోడ్డు డంపింగ్ యార్డు వద్ద ఏర్పాటు చేసిన మెటీరియల్ రికవరీ ఫెసిలిటీ (ఎంఆర్ఎఫ్) కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్వర్ణాంధ్రస్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతంగా అమలు చేస్తున్నామని తెలిపారు. గత నెల నిర్వహించిన పరిశుభ్రత కార్యక్రమాలకు ప్రజలు విశేషంగా స్పందించారని చెప్పారు.రాష్ట్రంలోని ఉత్తమ మూడు మున్సిపాలిటీల్లో మదనపల్లె మున్సిపాలిటీకి స్థానం దక్కడం జిల్లాకు గర్వకారణమని పేర్కొన్నారు. జిల్లాలో ఇప్పటివరకు సుమారు 2.68 లక్షల మంది ప్రజలు పరిశుభ్రత కార్యక్రమాల్లో పాల్గొన్నారని వెల్లడించారు.రాయచోటి మున్సిపాలిటీలో రోజుకు ఉత్పత్తి అయ్యే ఘన వ్యర్థాలను శాస్త్రీయంగా నిర్వహించేందుకు ఎంఆర్ఎఫ్ కేంద్రం ఉపయోగపడుతుందని తెలిపారు. ప్లాస్టిక్, రబ్బరు వంటి వ్యర్థాలను వేరు చేసి పునర్వినియోగానికి పంపడం ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు మున్సిపాలిటీకి ఆదాయం కూడా లభిస్తుందని చెప్పారు.జిల్లాలో ఘన వ్యర్థాల నిర్వహణకు అవసరమైన మౌలిక వసతులను దశలవారీగా ఏర్పాటు చేస్తున్నామని, రాయచోటిలో ఎఫ్ఎస్‌టీపీ ప్లాంట్ త్వరలో ప్రారంభం కానుందని, చౌడేపల్లి, గుర్రంకొండ ప్రాంతాల్లో గోవర్ధన్ ప్లాంట్ల పనులు కూడా పూర్తవుతున్నాయని కలెక్టర్ తెలిపారు.కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాస్, తహసీల్దార్ యామిని, మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.


## సీఎస్ఆర్ నిధులతో గ్రామాల అభివృద్ధి: మంత్రి సవిత






**రొద్దం, మన జనప్రగతి, జూలై 18:-** పరిశ్రమల స్థాపనతో సీఎస్ఆర్ నిధులు పెరుగుతున్నాయని, వాటి ద్వారా గ్రామాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి వేగవంతమవుతోందని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత అన్నారు.శ్రీసత్యసాయి జిల్లా రొద్దంలో రూ.6 కోట్ల సీఎస్ఆర్ నిధులతో నిర్మించనున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్సీ) భవనానికి ఎంపీ బీకే పార్థసారథి, జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్‌తో కలిసి మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సీఎస్ఆర్ నిధులు అందించిన బెల్ ఎలక్ట్రానిక్ సంస్థ ప్రతినిధులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.రాయలసీమలో పరిశ్రమల విస్తరణతో ఉపాధి అవకాశాలతో పాటు సీఎస్ఆర్ నిధులు కూడా పెరుగుతున్నాయని, వాటితో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నామని మంత్రి చెప్పారు. కియా సహా పలు పరిశ్రమలను రాష్ట్రానికి తీసుకురావడంలో సీఎం చంద్రబాబు కృషి చేశారని పేర్కొన్నారు.ఈ నెల 22న “తల్లికి వందనం“ పథకం నిధులు జమ చేస్తామని, రొద్దం పెద్ద చెరువు అభివృద్ధికి రూ.3.50 కోట్లు మంజూరయ్యాయని, పెనుకొండ నియోజకవర్గంలో ఐదు అంగన్‌వాడీ భవనాలను సీఎస్ఆర్ నిధులతో నిర్మించనున్నట్లు మంత్రి వెల్లడించారు.

## పులివెందుల మున్సిపల్ కమిషనర్‌గా శివ తనూజ బాధ్యతల స్వీకరణ



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి జూలై 18:-** పులివెందుల మున్సిపల్ కమిషనర్‌గా శనివారం శివ తనూజ నూతనంగా బాధ్యతలు చేపట్టారు. ఉన్నతాధికారుల ఉత్తర్వుల మేరకు ఆమె ఇక్కడి కమిషనర్‌గా విధుల్లో చేరారు.గ్రూప్-1 పరీక్షలో ఉత్తీర్ణత సాధించి మెరిట్ ద్వారా మొట్టమొదటిసారిగా మున్సిపల్ కమిషనర్‌గా పులివెందులలోనే బాధ్యతలు స్వీకరించడం విశేషం.ఈ సందర్భంగా నూతన కమిషనర్ శివ తనూజ మాట్లాడుతూ మున్సిపల్ కార్యాలయ సిబ్బంది అందరూ కలిసికట్టుగా పనిచేస్తే ఎలాంటి లక్ష్యాన్నైనా సాధించవచ్చుని పిలుపునిచ్చారు. పట్టణంలోని సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి,వాటి పరిష్కారానికి తన వంతు శాయశక్తులా కృషి చేస్తానని ఆమె హామీ ఇచ్చారు.బాధ్యతలు స్వీకరించిన అనంతరం మున్సిపల్ సిబ్బంది కమిషనర్ శివ తనూజకు పుష్పగుచ్ఛాలు అందించి,ఘన స్వాగతం పలికారు.ఆమెకు నూతన బాధ్యతల పట్ల శుభాకాంక్షలు తెలియజేశారు.కాగా,ఇప్పటివరకు ఇక్కడ కమిషనర్‌గా అదనపు బాధ్యతలు నిర్వహించిన ముని కుమార్ పులివెందుల ఆర్వో గా తిరిగి తన పూర్తిస్థాయి బాధ్యతలను చేపట్టారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు,కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రైతుల సమస్యల పరిష్కారానికే తొలి ప్రాధాన్యత: పులివెందుల ఆర్డీఓ చిన్నయ్య



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి జులై 18:** పులివెందుల రెవిన్యూ డివిజన్ పరిధిలోని రైతుల సమస్యల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యత ఇస్తామని,బాధితులకు ఖచ్చితంగా న్యాయం జరిగేలా చూస్తామని పులివెందుల ఆర్డీఓ చిన్నయ్య స్పష్టం చేశారు.శనివారం ఆర్డీఓ కార్యాలయంలో ఆయనను నియోజకవర్గంలోని పలు మండలాలకు చెందిన రైతులు స్వయంగా కలిసి తమ సమస్యలపై వినతిపత్రాలు సమర్పించారు.ఈ సందర్భంగా రైతుల నుంచి అర్జీలను స్వీకరించిన ఆయన వారితో ఓపిగ్గా మాట్లాడి సమస్యల వివరాలను అడిగి తెలుసుకున్నారు.పాస్ పుస్తకాలు,మ్యుటేషన్లు (పేరు మార్పిడి),మరియు వెబ్ ల్యాండ్ నమోదులో ఉన్న సాంకేతిక లోపాలు,సాగునీటి సరఫరా,పంట నష్ట పరిహారం మరియు స్థానిక రెవిన్యూ సరిహద్దు వివాదాలక్షేత్రస్థాయి పరిశీలన,సరిహద్దు వివాదాలు ఉన్న భూములను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని రైతుల విజ్ఞప్తి చేశారు.రైతుల విజ్ఞప్తి కి స్పదిస్తూ రైతులు రెవిన్యూ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పనిలేకుండా,అర్జీలపై త్వరితగతిన స్పందించి న్యాయం చేస్తాం అని క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలపై సంబంధిత తహశీల్దార్లు,విలేజ్ రెవిన్యూ అధికారులతో మాట్లాడి నివేదికలు తెప్పించుకుంటాం అని బాధితులెవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదన్నారు.ఈ కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన రైతు ప్రతినిధులు,రెవిన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా వ్యాప్తంగా పోలీసుల 'స్వచ్ఛాంధ్ర' శ్రమదానం..






**అన్నమయ్య జిల్లా ప్రతినిధి మన జనప్రగతి జులై 18:-**అన్నమయ్య జిల్లా పోలీసు శాఖ లిఎస్పీ శ్రీ ధీరజ్ కునుబిల్లి గారి ఆదేశాల మేరకు శనివారం జిల్లా వ్యాప్తంగా 'స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ప్రభుత్వ ఆదేశానుసారం ప్రతి నెలా మూడో శనివారం ప్రభుత్వ కార్యాలయాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలనే లక్ష్యంతో, ఎస్పీ కార్యాలయ ప్రాంగణం మరియు పరిసరాలను అధికారులు, సిబ్బంది శ్రమదానంతో శుభ్రం చేశారు. గడ్డపారలు, గుణపాలతో చెత్త, పిచ్చిమొక్కలను తొలగించి, చిన్న గుంతలను పూడ్చివేసి పరిసరాలను పరిశుభ్రంగా మార్చుకున్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్లు, సర్కిల్ మరియు డీఎస్పీ కార్యాలయాలలోనూ పోలీసు సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని తమ కార్యాలయ పరిసరాలను శుభ్రం చేసుకున్నారు.

## ప్రభుత్వ ఫలాలు రైతులకు కొండంత భరోసా: మార్కెట్ కమిటీ చైర్మన్ షఫీ నాయక్

**లక్కిరెడ్డిపల్లి మన జనప్రగతి జూలై 18:-** ఖరీఫ్-2026 సబ్సిడీ వేరుశనగ విత్తనకాయలను సద్వినియోగం చేసుకోవాలని లక్కిరెడ్డిపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ డాక్టర్ షఫి నాయక్ రైతులను కోరారు ఈ సందర్భంగా ఈరోజు లక్కిరెడ్డిపల్లి మార్కెట్ యార్డ్ వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు సబ్సిడీ వేరుశనగ విత్తన కాయలను ఈరోజు పంపిణీ చేశారు. రాష్ట్ర రవాణా శాఖామంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆయన సోదరుడు రాయచోటి టిడిపి నాయకులు లక్ష్మీప్రసాద్ రెడ్డి ఆదేశం మేరకు రైతులు నీటి సౌకర్యం చూసుకుని వేరుశనగ పంటను సాగు చేసుకొనుట మంచిదన్నారు. ఆధార్ నెంబర్ కు, సెల్ నెంబర్ లింక్ చేయించుకోన్న వారికి సబ్సిడీ వేరుశనగ కాయలు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ వెంకట్రామరాజు, తెలుగు యువత అధ్యక్షులు ఫకీరయ్య, కోనంపేట రజాక్ , కోనంపేట మాజీ సర్పంచ్ లక్ష్మీనారాయణ, ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్,నాని రెడ్డి రైతులు వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



మనజనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక
19 - 07 - 2026

# రాష్ట్రవ్యాప్తంగా దస్తావేజులేఖరులు (రైటర్స్)

● జూలై 20వ తేదీ నుండి 31వ తేదీ వరకు పెన్‌డౌన్ కార్యక్రమం






**పులివెందుల మన జనప్రగతి జూలై 18:–** రాష్ట్రవ్యాప్తంగా దస్తావేజులేఖరులు (రైటర్స్) జూలై 20వ తేదీ నుండి 31వ తేదీ వరకు పెన్‌డౌన్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పులివెందుల సబ్-రిజిస్ట్రార్ కార్యాలయానికి చెందిన దస్తావేజులేఖరులు ప్రెస్‌కు తెలియజేశారు.ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీవో నెంబర్ 396 కారణంగా వేలాది దస్తావేజులేఖరుల జీవనోపాధి ప్రమాదంలో పడే పరిస్థితి ఏర్పడిందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. రిజిస్ట్రేషన్ శాఖ ప్రైవేటీకరణ వలన ప్రజలకు కూడా తమ ఆస్తుల భద్రతపై అనుమానాలు కలుగుతాయని పేర్కొన్నారు.జీవో నెంబర్ 396ను వెంటనే రద్దు చేయాలని, దస్తావేజులేఖరుల ఉపాధిని కాపాడాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించేవరకు ఈ పెన్‌డౌన్ కార్యక్రమాన్ని కొనసాగిస్తామని తెలిపారు .ప్రజలందరూ ఈ ఉద్యమానికి సహకరించాలని, పరిస్థితిని గమనించి అప్రమత్తంగా ఉండాలని దస్తావేజులేఖరులు కోరారు. తమ భూములు, ఆస్తుల విషయంలో జాగ్రత్తగా ఉండి, అవసరమైన అన్ని పత్రాలను పరిశీలించుకుని ముందుకు వెళ్లాలని ప్రజలకు సూచించారు.ప్రజల సహకారం మరియు మద్దతుతోనే ఈ ఉద్యమం విజయవంతం అవుతుందని దస్తావేజులేఖరులు తెలిపారు.

# జగన్ 2.ఓ యాప్ పోస్టర్‌ను ఘనంగా ఆవిష్కరించిన వైఎస్సార్‌సీపీ నేతలు

● డిజిటల్ వేదికగా పార్టీ బలోపేతమే లక్ష్యం

● ప్రతి కార్యకర్త యాప్‌ను వినియోగించుకోవాలని పిలుపు




**రాయచోటి మన జనప్రగతి జూలై 18:–**వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని డిజిటల్ వేదికపై మరింత బలోపేతం చేసి, పార్టీ కార్యక్రమాలు, ప్రజా సమస్యలు, సంక్షేమ విధానాలను వేగంగా ప్రజలకు చేరవేసే లక్ష్యంతో రూపొందించిన 'జగన్ 2.ఓ' యాప్ పోస్టర్‌ను శనివారం రాయచోటిలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాష, మాజీ వైస్ చైర్మన్ ఫయాజుర్ రెహమాన్, జిల్లా మైనారిటీ అధ్యక్షుడు బేపారి మహమ్మద్ ఖాన్, పట్టణ కన్వీనర్ నవాజ్ తదితరులు మాట్లాడుతూ, మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా పార్టీ కార్యకర్తలు కూడా డిజిటల్ వేదికలను సమర్థవంతంగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. జగన్ 2.ఓ యాప్ ద్వారా పార్టీ సిద్ధాంతాలు, ప్రజా సమస్యలు, ప్రభుత్వ వైఫల్యాలు, పార్టీ కార్యక్రమాల సమాచారాన్ని క్షణాల్లో ప్రజలకు చేరవేయవచ్చని పేర్కొన్నారు.ప్రతి కార్యకర్త తమ మొబైల్‌లో యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని విస్తృతంగా వినియోగించుకోవడంతో పాటు ప్రజలకు కూడా పరిచయం చేసి పార్టీని మరింత బలోపేతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఆధునిక సాంకేతికతను ప్రజా ప్రయోజనాలకు వినియోగిస్తూ పార్టీ కార్యకలాపాలను మరింత సమర్థవంతంగా నిర్వహించడంలో జగన్ 2.ఓ యాప్ కీలక పాత్ర పోషిస్తుందని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు కొలిమి ఛాన్ బాష, ఫయాజ్ అహమ్మద్, గౌస్ ఖాన్, సుగవాసి శ్యామ్, అన్నా సలీం, ఆనందరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి రియాజుర్ రెహమాన్, ఖాదర్ బాష, ఖలీల్, జిల్లా మైనారిటీ కార్యదర్శి సైదియా నియాజ్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు చుక్కా అంజనప్ప, సగినాల శివశంకర్, గోపాల్ రెడ్డి, వీరణాగన్న, అమీర్, పట్టణ ఉపాధ్యక్షుడు నాగేంద్ర, హజరత్ ఖాదర్ వలీ, అనిల్, యూసుఫ్ ఖాన్, బేపారి జబీఉల్లా, ఇనాముల్లా, బేపారి అసద్, రౌఫ్, ఆఫ్జల్, హసనుల్లా, ఆర్షద్ అహమ్మద్, యూనుస్, నూర్, హాజర్, రియాజుర్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వసతి గృహాల సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి

- ఎస్సీ సెల్ అధ్యక్షుడు శ్రీనివాసులు



**సిద్ధవటం మన జనప్రగతి జూలై 18:–**రాష్ట్ర ప్రభుత్వం వసతి గృహాల్లో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఎస్సీ సెల్ అధ్యక్షుడు శ్రీనివాసులు అన్నారు. శనివారం సిద్ధవటం ఎస్సీ బాలుర వసతి గృహాన్ని సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న అల్పాహారం నాణ్యతతో పాటు వసతి గృహంలోని సౌకర్యాలను పరిశీలించారు.ఆయన మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత విద్యార్థులకు నాణ్యమైన సన్నబియ్యంతో కూడిన ఆహారం, మెరుగైన వసతులు అందిస్తున్నట్లు తెలిపారు. రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చమ్మర్తి జగన్మోహన్‌రాజు ఆదేశాల మేరకు హాస్టల్‌ను పరిశీలించగా టాయిలెట్లు, బాత్‌రూములు, వంటగది పరిశుభ్రంగా ఉన్నాయని, విద్యార్థులు కూడా సంతృప్తి వ్యక్తం చేశారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యం, సంక్షేమ రంగాలకు ప్రాధాన్యత ఇస్తూ విద్యార్థుల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు భవనాసి మునెయ్య, విద్యార్థులు, హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

# స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న డి.పి.ఓ



**గుర్రంకొండ మన జనప్రగతి జూలై 18:–** అన్నమయ్య జిల్లా గుర్రంకొండ గ్రామ పంచాయతీ నందు స్వచ్ఛ ఆంధ్ర – స్వర్ణ ఆంధ్ర "కార్యక్రమం నిర్వహించారు.గుర్రంకొండ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల (తెలుగు)నుండి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమలో మన జిల్లా డి పి ఓ బి.రాధమ్మ పాల్గొన్నారు. స్థానిక పాఠశాల విద్యార్థులు వివిధ శాఖల ప్రభుత్వ ఉద్యోగులు ర్యాలీ లో పాల్గొన్నారు. ర్యాలీ ఉన్నత పాఠశాల నుండి స్థానిక బస్టాండ్ వరకు కొనసాగింది. డి పి ఓ ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు స్వచ్ఛత పై అవగాహన కలిగించారు. బస్టాండ్ నందు మానవహారంగా ఏర్పడి పరిసరాలను శుభ్రంగా ఉంచుకొంటామని అందరు ప్రమాణం చేశారు. గుర్రంకొండ లో టమేటో మార్కెట్ యార్డు నందు కొత్తగా చేపట్టే గోబర్ గ్యాస్ స్థలాన్ని డి పి ఓ పరిశీలించారు. ఈ కార్యక్రమం లో మండల టిడిపి అధ్యక్షులు నాయని జగదీష్ కుమార్, నౌషాద్ అహమ్మద్, ఏజాజ్ అహమ్మద్, ఐ టిడిపి రంజిత్ కుమార్, ఇనుగొండ రామయ్య, కె. రెడ్డెప్ప రెడ్డి, ఇతర టిడిపి నాయకులు,ఎంపీడీఓ జి. పరమేశ్వర రెడ్డి, డిప్యూటీ ఎంపీడీఓ కె. శ్రీహరి పంచాయతీ కార్యదర్శులు బి. సంధ్యా రాణి, యన్. నిసార్ అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

# గాలివీడు మండలంలో చోరీ

- 30 తులాల బంగారం, రూ.50 వేల నగదు అపహరణ



**గాలివీడు మన జనప్రగతి జూలై 18:–**గాలివీడులో హైస్కూల్ సమీపంలోని పూసల కాలనీలో గురువారం రాత్రి ఓ ఇంట్లో దొంగలు పడి బంగారు నగలు, నగదు దోచుకెళ్లారు. వివరాల్లోకి వెళితే.. చెప్పలి అలియాస్ కూరగాయల చంద్ర, రాణమ్మలు గత 40 ఏళ్లుగా చిరు వ్యాపారాలు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఈ క్రమంలో కుమారుడు ఉద్యోగంలో స్థిరపడగా, రామచంద్ర సంతల్లో కూరగాయల వ్యాపారం చేస్తుంటాడు. వ్యాపారంలో సంపాదించిన డబ్బుతో పాటు కుమారుడి వివాహానికి అత్త ఇచ్చిన బంగారు ఆభరణాలను ఇంట్లోని బీరువాలో భద్రపరచి సంతకు వెళ్లారు. ఈ క్రమంలో గురువారం కోనంపేట సంతకు వెళ్లి తిరిగి రావడానికి బస్సు లేక కుమార్తె ఇంటికి వెళ్లారు. శుక్రవారం ఉదయం ఇంటికి వచ్చి చూడగా తలుపులు, బీరువా పగులగొట్టి 30 తులాల బంగారు ఆభరణాలు, రూ.50 వేల నగదు దోచుకెళ్లినట్లు గుర్తించారు. సంఘటనను గమనించిన రామచంద్ర పోలీసులకు ఫిర్యాదు చేయగా లక్కిరెడ్డిపల్లి సీఐ, గాలివీడు ఎస్ఐ సిబ్బంది, డాగ్ స్క్వాడ్‌తో వచ్చి పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# తడిపొడి చెత్త వేరు చేయండి.. ఉంతకల్లులో విద్యార్థులకు అవగాహన



**బొమ్మనహాల్ మన జనప్రగతి జూలై 18:–** మండల పరిధిలో ఉంతకల్లు గ్రామంలో మండల ఎంపీడీవో విజయభాస్కర్ ఆధ్వర్యంలో స్వర్ణాంధ్రస్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు, ఈ సందర్భంగా భాగంగా ఎంపిడివో విజయభాస్కర్ మాట్లాడుతూ..గ్రామంలో పేరుకుపోయిన చెత్తను పంచాయతీలో ఉన్న గ్రీన్ అంబాసిడర్లు తో తొలగించి గ్రామాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దారు,అనంతరం గ్రామంలోని చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో కలసి సందర్శించారు,ముఖ్యంగా ప్రతి ఇంటింటి నుంచి గ్రీన్ అంబాసిడర్లు సేకరించే తడి చెత్తతో సేంద్రియ ఎరువులు తయారు చేసే విధానం,వాటిని విక్రయించడం ద్వారా గ్రామపంచాయతీకి ఆదాయం ఎలా సమకూరుతుందనే విషయాలను విద్యార్థులకు వివరించారు,అలాగే ప్రతి విద్యార్థి తమ ఇంట్లో తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా ఉంచి సిబ్బందికి అందజేయాలని,తమ తల్లిదండ్రులకు కూడా చెత్త వర్గీకరణ,పరిశుభ్రత ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలని ఎంపీడీవో విజయభాస్కర్ సూచించారు, అదేవిదంగా గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడం ప్రతి పౌరుడి బాధ్యతని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శి,గ్రీన్ అంబాసిడర్లు,పంచాయతీ గ్రీన్ అంబాసిడర్లు,పాఠశాల ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

# నేమకల్లు ఆంజన్నకు ప్రత్యేక పూజలు




**బొమ్మనహాల్ మన జనప్రగతి జూలై 18:–** మండలంలోని నేమకల్లు గ్రామంలో అత్యంత ప్రసిద్ధిగాంచిన బాలాలయంలో శనివారం తెల్లారుజామున నుంచి స్వామి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు,ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు అనిల్‌కుమార్ చార్యులు ఆధ్యర్యంలో స్వామిని పట్టువస్త్రాలు,పుష్పాలతో శోభాయమానంగా అలంకరించి పురోహితులు వేకువజాము నుంచే స్వామి వారికి కుంకుమార్చన, పంచామృతాభిషేకం,ఆకుపూజ, విశేష పూజా అలంకరణ, అర్చనలు నిర్వహించారు, అంజన్న ను దర్శనం కోసం ఆలయంలో పెద్ద ఎత్తున తరలివచ్చి దర్శించుకున్నారు, కర్ణాటక,ఆంధ్ర ప్రాంతాల నుంచి వేలాది మంది ఆలయానికి విచ్చేసిన భక్తులకు స్వామి దర్శించుకున్నారు,అనంతరం భక్తులకు అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించారు.

# ఫ్యాక్షన్ ప్రభావిత గ్రామాలపై ప్రత్యేక నిఘా: జిల్లా ఎస్పీ



**కడప, మన జనప్రగతి, జూలై 18:–** ఫ్యాక్షన్ ప్రభావిత గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించి రౌడీ షీటర్లు, ట్రబుల్ మాంగర్ల కదలికలపై నిఘా ఉంచడంతో పాటు వారికి కౌన్సిలింగ్ నిర్వహించాలని జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఐపీఎస్ పోలీసు అధికారులను ఆదేశించారు.జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన పులివెందుల సబ్ డివిజన్ నేర సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళల భద్రతపై గ్రామాలు, పాఠశాలలు, కళాశాలల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, గస్తీని మరింత పెంచాలని సూచించారు.రోడ్డు ప్రమాదాల నివారణకు డ్రంకెన్ డ్రైవ్, అధిక వేగం, మైనర్ డ్రైవింగ్‌పై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే గ్యాంబ్లింగ్, మట్కా, క్రికెట్ బెట్టింగ్, గంజాయి, ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణాపై దాడులు ముమ్మరం చేయాలని సూచించారు.ప్రజా ఫిర్యాదులను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని, ఎస్సీ, ఎస్టీ, వైట్ కాలర్ నేరాల దర్యాప్తును వేగవంతం చేయాలని ఆదేశించారు. సమావేశంలో పులివెందుల డీఎస్పీ మురళీనాయక్‌తో పాటు సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

# పులివెందుల శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక ప్రదర్శనలు




**పులివెందుల అర్బన్ మన జనప్రగతి జూలై 18:** స్థానిక శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా నేడు ప్రత్యేక నృత్య ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు శిల్పారామం సాంస్కృతిక కార్యక్రమల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ టి.విశ్వనాథరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.మన సాంప్రదాయ కళలను ప్రోత్సహించడం,ప్రజలకు ఆహ్లాదకరమైన సాంస్కృతిక వినోదాన్ని అందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.కడపకు చెందిన ప్రముఖ నృత్య కళాకారిణి, సీఎం అవార్డు గ్రహీత మాస్టర్ ఎన్. విజయశాంతి ఆధ్వర్యంలోని 'ముద్ర డాన్స్ స్కూల్' విద్యార్థుల చే ప్రత్యేక నృత్య ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ సాంస్కృతిక కార్యక్రమానికి పులివెందుల పట్టణ ప్రజలు, కళాభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి, కళాకారులను ప్రోత్సహిస్తూ కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా శిల్పారామం సాంస్కృతిక కార్యక్రమాల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ టి.విశ్వనాథరెడ్డి కోరారు.

# పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా పని చేయాలి






**గాలివీడు మన జనప్రగతి జులై 18:–** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైఎస్సార్సీపీ లీగల్ సెల్ అధ్యక్షులు జల్లా సుదర్శన్ రెడ్డిని కలసిన గాలివీడు మండల నాయకులు గాలివీడు గ్రామ నాయకులు జల్లా సుదర్శన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి, మండలంలోని ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, పార్టీ బలోపేతం, గ్రామస్థాయిలో చేపట్టాల్సిన కార్యక్రమం నిర్వహించారు. రానున్న స్థానిక ఎన్నికలపై విస్తృతంగా చర్చించడం జరిగింది.ఈ సందర్భంగా పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా సమిష్టిగా పనిచేయాలని, ప్రతి గ్రామంలో పార్టీ కార్యకలాపాలను ప్రజలకు చేరువ చేస్తూ వైఎస్సార్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని నాయకులు నిర్ణయించారు...

మన జనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక
19 - 07 - 2026

# జల్ జీవన్ పథకంతో ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు

**● మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ● కోనంపేట,జాండ్రపల్లి గ్రామాల్లో పర్యటన ● టీడీపీలో చేరిన 100 వైసీపీ కుటుంబాలు**




**రాయచోటి స్టాపర్/లక్కిరెడ్డిపల్లి మన జనప్రగతి జులై 18:–** జల్ జీవన్ పథకం ద్వారా ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ కల్పించి తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామని రాష్ట్ర రోడ్లు, రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. శనివారం కోనంపేట, జాండ్రపల్లి గ్రామాల్లో పర్యటించిన ఆయన స్థానిక ప్రజల సమస్యలను తెలుసుకుని అధికారులకు పలు సూచనలు చేశారు.రాయచోటి నియోజకవర్గానికి తొలిసారిగా జల్ జీవన్ పథకం మంజూరు కావడం శుభపరిణామమని మంత్రి పేర్కొన్నారు. ఇప్పటికే మారుమూల గ్రామాలకు సైతం కోట్ల రూపాయలతో తారు రోడ్లు, సిమెంట్ రోడ్లు, తాగునీటి సౌకర్యాలు వంటి మౌలిక వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలను వేగంగా పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.ఈ కార్యక్రమంలో మంత్రి సోదరుడు మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరిప్రసాద్, మండల పార్టీ అధ్యక్షుడు యనమల మదనమోహన్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.ఎన్.డి. షఫీ నాయక్, క్లస్టర్ ఇన్‌చార్జి శంకరపు జయరాం, డీసీసీబీ డైరెక్టర్ దేవేందర్ రెడ్డి, మాజీ ఎంపీపీ ఉమాపతి రెడ్డి, దినపాడు చెరువు అధ్యక్షుడు మోహన్ రెడ్డి, లక్కిరెడ్డిపల్లి సింగిల్ విండో అధ్యక్షుడు లక్ష్మీరాజు, మాజీ సర్పంచ్ లక్ష్మీనారాయణ, యాగంటి సుధీర్ కుమార్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధల నడుమ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామివారికి ప్రత్యేక అలంకరణ

**● పంచముఖ ఆంజనేయస్వామివారికి విశేష పూజలు.. భారీగా తరలివచ్చిన భక్తులు**





**ఉరవకొండ మన జనప్రగతి జులై 18:–**ఉరవకొండ పట్టణంలోని డ్రైవర్స్ కాలనీలో వెలసిన శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం పంచమి తిథి సందర్భంగా విశేష పూజలు, ప్రత్యేక అలంకరణలు భక్తిశ్రద్ధల నడుమ వైభవంగా నిర్వహించారు.ఈ సందర్భంగా శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామివారిని సువర్ణాభరణాలు, పుష్ప మాలలు,తులసీమాలలతో సుందరంగా అలంకరించారు. స్వామివారి దివ్య మంగళ రూపం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. వేదమంత్రోచ్చారణల మధ్య అర్చకులు ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు,మహామంగళహారతులు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.అదేవిధంగా ఆలయ ప్రాంగణంలోని శ్రీ పంచముఖ ఆంజనేయస్వామివారికి ప్రత్యేక అలంకరణ చేసి విశేష పూజలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు కుటుంబ సౌఖ్యం, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం కలగాలని ప్రార్థనలు చేశారు.పంచమి శనివారం సందర్భంగా ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.ఆలయ కమిటీ సభ్యులు, ఎయిర్‌టెల్ ప్రతాప్ ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయడంతో కార్యక్రమం ప్రశాంతంగా, ఆధ్యాత్మిక వాతావరణంలో కొనసాగింది.“గోవిందా... గోవిందా...“, “జై శ్రీరామ్... జై హనుమాన్...“ నామస్మరణలతో ఆలయ పరిసరాలు మార్మోగి భక్తిమయ వాతావరణం నెలకొంది.

# చవితి వేడుకలకు ముందస్తు ఏర్పాట్లు చేయాలి

**● జిల్లా యంత్రాంగాన్ని కోరుతూ జాయింట్ కలెక్టర్‌కు గణేశ ఉత్సవ సమితి వినతి**




**కాకినాడ మన జనప్రగతి జులై 18:–**వచ్చే సెప్టెంబర్‌లో జరిగే శ్రీ వినాయక చవితి, గణపతి నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టి, జిల్లా స్థాయిలో సమన్వయ సమావేశాలు నిర్వహించాలని కాకినాడ నగర గణేశ ఉత్సవ సమితి జిల్లా యంత్రాంగాన్ని కోరింది. ఈ మేరకు జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్‌కు సమితి ప్రతినిధులు శనివారం వినతిపత్రం అందజేశారు.సమితి అధ్యక్షుడు, గణపతి పీఠం ఉపాసకులు దూసర్లపూడి రమణరాజు, జిల్లా ఆహ్వాన కమిటీ కార్యనిర్వాహక అధ్యక్షుడు రంభాల వెంకటేశ్వరరావు జాయింట్ కలెక్టర్‌ను కలిసి పలు అంశాలను వివరించారు. సెప్టెంబర్ 14 నుంచి ప్రారంభమయ్యే గణపతి నవరాత్రి ఉత్సవాలు, 23, 24 తేదీల్లో జరిగే నిమజ్జన కార్యక్రమాల దృష్ట్యా జిల్లా వ్యాప్తంగా ముందస్తు సమన్వయ సమావేశాలు నిర్వహించాలని కోరారు.ఆర్డీవో, తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్ల ఆధ్వర్యంలో రెవెన్యూ, పోలీస్, ట్రాఫిక్, ట్రాన్స్‌కో, అగ్నిమాపక, వైద్య, దేవాదాయ, మత్స్య, పోర్టు తదితర శాఖల అధికారులతో పాటు వినాయక మండపాల నిర్వాహకులను భాగస్వామ్యం చేస్తూ అవగాహన సమావేశాలు నిర్వహించాలని సూచించారు.వర్షాకాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని నిమజ్జన ఘాట్ల వద్ద అవసరమైన మౌలిక సదుపాయాలు ముందుగానే సిద్ధం చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.కాకినాడ నగరంలో వినాయక సాగర్, రూరల్ పరిధిలోని వాకలపూడి బీచ్ వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేయాల్సిన అవసరం ఉందని సమితి ప్రతినిధులు తెలిపారు. నగరంలో 1989 నుంచి గణేశ్ ఉత్సవాలను నిర్వహిస్తున్నామని, గత నాలుగేళ్లుగా జిల్లా ఆహ్వాన కమిటీ ఆధ్వర్యంలో ఏడు నియోజకవర్గాల పరిధిలోని మండప కమిటీలతో సమన్వయం చేస్తూ జిల్లా యంత్రాంగానికి వారధిగా పనిచేస్తున్నామని వివరించారు.అలాగే రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్. మాధవ్‌కు కూడా వినతిపత్రాల ప్రతులను పోస్టు ద్వారా పంపినట్లు తెలిపారు. వచ్చే వారం అన్నవరం దేవస్థానంలో ఈఓ ఆధ్వర్యంలో కాకినాడ జిల్లా గణేశ ఉత్సవాల 38వ వార్షిక ఆహ్వాన పత్రికను ఆవిష్కరించనున్నట్లు రంభాల వెంకటేశ్వరరావు వెల్లడించారు.


# షైనింగ్ స్టార్ అవార్డుకు కేజీబీవీ విద్యార్థిని,ఎం.దివ్య ఎంపిక

**- హర్షం వ్యక్తం చేసిన ఎంఈఓ లు,కళాశాల ప్రిన్సిపల్,గ్రామ పెద్దలు**



**బొమ్మనహల్ మన జనప్రగతి జులై 18:–**స్థానిక బొమ్మనహల్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం (కేజీబీవీ) పాఠశాలలో చదువుకున్న గోడసలపల్లి గ్రామానికి చెందిన యం.విశ్వనాథ్ కూతురు యం.దివ్య,కు గత ఏప్రిల్ నెలలో విడుదలైన పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో600 మార్కులకు గాను 574 మార్కులు సాధించిన మండలంలో ప్రథమ స్థానంలో నిలిచిన విషయం అందరికీ తెలిసిందే..అందులో భాగంగా ఎం.దివ్య అను విద్యార్థిని ప్రతిష్ఠాత్మక మరో అద్భుత అవకాశాన్ని షైనింగ్ స్టార్ అవార్డుకు ఎంపిక కావడం జరిగిందన్నారు,ఇది పాఠశాలకే గర్వకారణంగా నిలిచింది.విద్యా రంగంలో కనబరిచిన ప్రతిభ క్రమశిక్షణ,ఉత్తమ ప్రతిభకు గుర్తింపుగా ఈ అవార్డు లభించినట్లు మండల విద్యాశాఖ అధికారులు తెలిపారు,ఈ అవార్డును సోమవారం రోజున అనంతపురం జిల్లా కేంద్రంలోని జేఎన్‌టీయూ ఆడిటోరియంలో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ చేతుల మీదుగా ఎం. దివ్యకు షైనింగ్ స్టార్ అవార్డును ప్రదానం చేయనున్నట్లు మండల విద్యాశాఖ అధికారులు,వీరన్న మల్లికార్జున,ప్రిన్సిపాల్ కమలమ్మ,వెల్లడించారు.ఈ సందర్భంగా ఎం.దివ్యను పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు,విద్యాశాఖ అధికారులు అభినందిస్తూ, భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరుకుని పాఠశాల, మండలానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ అవార్డుతో బొమ్మనహల్ కేజీబీవీకి మరోసారి ప్రత్యేక గుర్తింపు లభించిందని వారు హర్షం వ్యక్తం చేశారు.

# గవిమఠం 9వ పీఠాధిపతి జగద్గురు చెన్న బసవ రాజేంద్ర స్వామి శివైక్యం



**ఉరవకొండ మన జనప్రగతి జులై 18:–**ఉరవకొండ శ్రీ గవిమఠ సంస్థానం 9వ పీఠాధిపతి జగద్గురు శ్రీ చెన్న బసవ రాజేంద్ర స్వామి (98) శనివారం బళ్లారిలో శివైక్యం చెందారు. కొంతకాలంగా వయోభారంతో పాటు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు.జగద్గురువు శివైక్యంతో గవిమఠం భక్తులు, శిష్యులు, మఠాధిపతులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆధ్యాత్మిక బోధనలతో పాటు విద్య, సామాజిక సేవా కార్యక్రమాల్లో విశేష సేవలందించిన ఆయన మరణం గవిమఠానికి తీరని లోటుగా భావిస్తున్నారు.770 అనుబంధ మఠాలకు మూలపీఠంగా పేరొందిన గవిమఠ సంస్థానం ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో విస్తృత సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోంది. జగద్గురువు శివైక్యంతో తదుపరి పీఠాధిపతి ఎంపికపై భక్తులు, మఠ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. ప్రస్తుతం మఠ పరిపాలనలో ఉన్న కళ్యాణ స్వామీజీ, ఉరవకొండ ఉత్తరాధికారి డాక్టర్ కరిబసవ రాజేంద్ర స్వామి పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి.తదుపరి పీఠాధిపతి ఎంపికపై మఠం అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. ప్రస్తుతం గవిమఠంలో అంత్యక్రియలు, తదుపరి కార్యక్రమాల ఏర్పాట్లు కొనసాగుతున్నాయి.

# శాస్త్రీయ వ్యర్థాల నిర్వహణతో పరిశుభ్రమైన వాతావరణం సాధ్యం

**● జిల్లా కలెక్టర్,నగరపాలక ప్రత్యేక అధికారిణి డాక్టర్ ఏ.సిరి.**





**కర్నూలు బ్యూరో మన జనప్రగతి జులై 18:–**నగరంలోని వ్యాపార, వాణిజ్య సముదాయాలు తమ వద్ద ఉత్పత్తి అయ్యే వ్యర్థాలను సొంతంగానే ప్రాసెస్ చేసేందుకు వ్యర్థాల ప్రాసెసింగ్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకోవాలని జిల్లా కలెక్టర్, నగరపాలక ప్రత్యేక అధికారిణి డాక్టర్ ఏ. సిరి సూచించారు. స్వర్ణాంధ్రస్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక జ్యోతి డిపార్ట్‌మెంటల్ స్టోర్‌లో యాజమాన్యానికి ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనలు2026 పై అవగాహన కల్పించి ‘బల్క్ వేస్ట్ జనరేటర్‘ నమోదు ప్రక్రియను కమిషనర్ చల్లా ఓబులేసుతో కలిసి ఆమె ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనలు2026, స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో భాగంగా రోజుకు 100 కిలోలకుపైగా ఘన వ్యర్థాలను ఉత్పత్తి చేసే వ్యాపార, వాణిజ్య సముదాయాలు, హోటళ్లు, షాపింగ్ మాల్స్, ఫంక్షన్ హాళ్లు, విద్యాసంస్థలు తదితర సంస్థలు బల్క్ వేస్ట్ జనరేటర్లుగా నమోదు కావాల్సి ఉంటుందని తెలిపారు. ఇటువంటి సంస్థలు తమ వద్ద ఉత్పత్తి అయ్యే తడి వ్యర్థాలను సాధ్యమైనంత వరకు ప్రాంగణంలోనే కంపోస్టింగ్, బయోమీథనేషన్ లేదా ఇతర ఆమోదిత సాంకేతికతల ద్వారా శాస్త్రీయంగా ప్రాసెస్ చేయాలని కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని పేర్కొన్నారు. సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (సిపిపిబి) కేంద్రీకృత ఆన్‌లైన్ పోర్టల్‌లో సంబంధిత సంస్థలు నమోదు చేసుకోవడం ద్వారా బల్క్ వేస్ట్ జనరేటర్లుగా గుర్తింపు పొందుతాయని తెలిపారు. అనంతరం నగరపాలక సంస్థ సంబంధిత వివరాలను ధృవీకరించి, నిబంధనల ప్రకారం ఏర్పాటు చేయాల్సిన వ్యర్థాల ప్రాసెసింగ్ యూనిట్లపై అవసరమైన మార్గదర్శకాలు అందిస్తుందని చెప్పారు. నిబంధనలను పాటించని సంస్థలపై చట్టపరమైన చర్యలు తీసుకునే అధికారం జిల్లా కలెక్టర్, నగరపాలక సంస్థకు ఉందని స్పష్టం చేశారు. నగరపాలక కమిషనర్ మాట్లాడుతూ.. వ్యర్థాలను మూలంలోనే శాస్త్రీయంగా నిర్వహించడం ద్వారా కాలుష్యాన్ని గణనీయంగా తగ్గించడంతో పాటు నగర పరిశుభ్రతను మరింత మెరుగుపరచవచ్చని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ, స్థిరమైన వ్యర్థాల నిర్వహణ లక్ష్యంగా ప్రభుత్వం ఇటువంటి స్వీయ వ్యర్థాల ప్రాసెసింగ్ విధానాలను ప్రోత్సహిస్తోందన్నారు. పెద్ద వ్యాపార సముదాయాలు, షాపింగ్ మాల్స్, హోటళ్లు, ఫంక్షన్ హాళ్లు, విద్యాసంస్థలు తదితర బల్క్ వేస్ట్ జనరేటర్లు నిబంధనలకు అనుగుణంగా ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసి వ్యర్థాలను మూలంలోనే శాస్త్రీయంగా నిర్వహించాలని కమిషనర్ సూచించారు. ఈ విధానం ద్వారా నగరపాలక సంస్థపై వ్యర్థాల రవాణా భారం తగ్గడంతో పాటు పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రత, సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు దోహదపడుతుందని తెలిపారు. సంబంధిత నిబంధనలను ప్రతి బల్క్ వేస్ట్ జనరేటర్ తప్పనిసరిగా పాటించాలని కమిషనర్ సూచించారు.కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ ఎం.రఘు, డిఈఈ పవన్, సానిటరీ సూపర్వైజర్ రమేష్ బాబు, ఇంస్పెక్టర్లు జిలాని, అనిల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# నీట్-2026లో ప్రతిభ చాటిన రైతు బిడ్డ తేజస్విని - ఆల్ ఇండియా ర్యాంక్ 10111



**సిద్ధవటం మన జనప్రగతి జూలై 18:–**సిద్ధవటం మండలం మంగ్లవారిపల్లె గ్రామానికి చెందిన నిరుపేద రైతు కుటుంబంలో జన్మించిన విద్యార్థిని తేజస్విని నీట్2026లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి ఆల్ ఇండియా ర్యాంక్ 10111 సాధించింది. బెంగళూరులోని నారాయణ విద్యాసంస్థల్లో శిక్షణ పొందిన ఆమె ఈ విజయంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థిని తల్లి సువర్ణ మాట్లాడుతూ, గత ఏడాది తన భర్త సుధాకర్ గుండెపోటుతో మృతి చెందారని, ప్రస్తుతం పొలం పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నట్లు తెలిపారు. ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా కుమార్తె చదువుకు ప్రాధాన్యం ఇచ్చి ప్రోత్సహించామని, ఆమె వైద్య విద్య పూర్తిచేసి ఉన్నత స్థాయికి చేరే వరకు తమ వంతు కృషి కొనసాగిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని కుటుంబ సభ్యులు, బంధువులు పాల్గొని తేజస్వినిని అభినందించారు.

# మాజీ సర్పంచ్ ఎర్రి స్వామికి మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్ రెడ్డి నివాళి



**వజ్రకరూర్ మన జనప్రగతి జూలై 18:–** వజ్రకరూర్ మండలం పెద్ద ప్యాపిలి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు చాకలి ఎర్రి స్వామి అనారోగ్యంతో మృతిచెందడం పట్ల మాజీ ఎమ్మెల్యే వై. విశ్వేశ్వర్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శనివారం ఆయన పెద్ద ప్యాపిలి గ్రామానికి చేరుకుని ఎర్రి స్వామి భౌతికకాయానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు.అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఎర్రి స్వామి పార్టీకి, గ్రామాభివృద్ధికి చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొంటూ, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ క్లిష్ట సమయంలో కుటుంబ సభ్యులకు ధైర్యం కలగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అశోక్ కుమార్, సీపీ వీరన్న, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు డీ. సురేష్ (డిష్), జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ మల్లెల జగదీష్, స్థానిక నాయకులు మాబు సాబ్, కిష్టా చంద్ర నాయక్, ధనుంజయ, విజయ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ఎర్రచందనం అక్రమ రవాణా భగ్నం..తమిళ స్మగ్లర్ అరెస్ట్

**- కారు,18 ఎర్రచందనం దుంగలు స్వాధీనం.. రూ.16 లక్షల విలువ ఉంటుందని అంచనా**



**భాకరాపేట మన జనప్రగతి జూలై 18:–**ఎర్రచందనం అక్రమ రవాణాకు పాల్పడుతున్న తమిళనాడుకు చెందిన ఓ స్మగ్లర్‌ను భాకరాపేట అటవీశాఖ అధికారులు అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి ఓ కారు, 18 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.16 లక్షలు ఉంటుందని అటవీ అధికారులు అంచనా వేశారు.తిరుపతి జిల్లా అటవీశాఖాధికారి వి. సాయిబాబా ఆదేశాల మేరకు భాకరాపేట రేంజ్ అటవీక్షేత్రాధికారి ఎన్.వెంకటరమణకు జూలై 17వ తేదీ రాత్రి చిన్నగొట్టిగల్లు మీదుగా తమిళనాడుకు కారులో ఎర్రచందనం తరలిస్తున్నారనే సమాచారం అందింది. దీంతో రేంజ్ సిబ్బంది, బేస్ క్యాంపు సిబ్బంది, స్ట్రైక్ ఫోర్స్ ప్రొటెక్షన్ వాచర్లు కోటటైలు క్రాస్ వద్ద నిఘా ఏర్పాటు చేశారు.జూలై 18 తెల్లవారుజామున సుమారు 4 గంటల సమయంలో అనుమానాస్పదంగా వేగంగా వస్తున్న కారును అటవీ సిబ్బంది ఆపేందుకు ప్రయత్నించారు. కారు నిలిపిన వెంటనే డ్రైవర్ పరారయ్యేందుకు ప్రయత్నించగా అప్రమత్తమైన సిబ్బంది అతడిని చుట్టుముట్టి పట్టుకున్నారు. అనంతరం కారును తనిఖీ చేయగా అందులో 18 ఎర్రచందనం దుంగలు లభించాయి.ఈ దాడిలో ఎఫ్‌బీఓలు ఎం.సదాశివయ్య, జె.బి. నిఖిల్, వై. రాజేష్ కుమార్, సి. రవి తదితరులతో పాటు ప్రొటెక్షన్ వాచర్లు పాల్గొన్నారు.ఎర్రచందనం అక్రమ రవాణాపై నిరంతరం నిఘా కొనసాగిస్తున్నామని అటవీ అధికారులు తెలిపారు.


# సార్వత్రిక విద్యాపీఠంతో ఉన్నత విద్యకు సువర్ణావకాశం

- ఓపెన్ స్కూల్ ప్రవేశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి
- మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి



**అన్నమయ్య జిల్లా ప్రతినిధి మన జనప్రగతి జులై 18:**-ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ద్వారా ప్రతి ఒక్కరికీ ఉన్నత విద్యను అభ్యసించేందుకు సువర్ణావకాశం కల్పించబడిందని, పాఠశాల విద్యను మధ్యలో నిలిపివేసిన వారు, పదో తరగతి లేదా ఇంటర్మీడియట్‌లో ఫెయిల్ అయినవారు ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర రవాణా యువజన క్రీడల శాఖ మంత్రి శ్రీ మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పిలుపునిచ్చారు..శనివారం ఉదయం మంత్రి తన నివాసంలో ఓపెన్ స్కూల్ 20262027 విద్యాసంవత్సర ప్రవేశాలకు సంబంధించిన ప్రచార కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయన మాట్లాడుతూ 14 సంవత్సరాలు పూర్తై చదవడం, రాయడం తెలిసిన వారు పదో తరగతిలో ప్రవేశం పొందవచ్చని,పదో తరగతి ఉత్తీర్ణులై 15 సంవత్సరాలు నిండిన వారు ఇంటర్మీడియట్‌లో చేరేందుకు ప్రభుత్వం చక్కని అవకాశం కల్పించిందని దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఓపెన్ స్కూల్ జిల్లా కోఆర్డినేటర్ కొండూరు శ్రీనివాస్ రాజు, డైట్ ఇన్‌చార్జి ప్రిన్సిపల్ మడితాటి నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జల్ జీవన్ పథకం ద్వారా ఇంటింటికి కులాయి కలెక్షన్ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి



**అక్కిరెడ్డిపల్లి/రాయచోటి స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి జులై 18:**-జల్ జీవన్ పథకం ద్వారా ఇంటింటికీ కొళాయి కనెక్షన్ ఏర్పాటు చేసి త్రాగునీటి సమస్య తీరుస్తామని రాష్ట్ర రోడ్డు రవాణా యోజన క్రీడా శాఖ మంత్రి మంటపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు శనివారం కోనంపేట జాంద్రపల్లి గ్రామాలలో ఆయన పర్యటించి ప్రజా సమస్యలపై ఆరా తీశారు ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యలు పరిష్కరిస్తామన్నారు రాయచోటి నియోజకవర్గం లో జల్జీవన్ పథకం మొట్టమొదటిసారి మంజూరు చేయడం శుభపరిణామం అన్నారు ఇప్పటికే మారుమూల ప్రాంతం సైతం కోట్ల రూపాయలు హెచ్చించి తారు రోడ్లు సిమెంట్ రోడ్లు త్రాగునీటి సమస్య అన్ని తక్షణమే పరిష్కరిస్తున్నామని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో మంత్రి సోదరుడు మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి హరి ప్రసాద్ మండల టిడిపి అధ్యక్షుడు యనమల మదనమోహన్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్ ఎన్ డి షపినాయక్ క్లస్టర్ ఇంచార్జి శంకరపు జయరాం డిసిసిబి చైర్మన్ దేవేందర్ రెడ్డి మాజీ ఎంపీపీ ఉమాపతి రెడ్డి దినపాడు చెరువు ప్రెసిడెంట్ మోహన్ రెడ్డి లక్కిరెడ్డిపల్లె సింగల్ బెండు అధ్యక్షుడు లక్ష్మీరాజు మాజీ సర్పంచ్ లక్ష్మీనారాయణ యాగంటి సుధీర్ కుమార్ టిడిపి కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు .లక్కిరెడ్డిపల్లి జడ్పిటిసి (వైసిపి) మాజీ ఎంపీపీ అంబా బత్తిన రెడ్డయ్య దప్పేపల్లి గ్రామానికి చెందిన మరి కొంతమంది వైసీపీ నాయకులు 100 కుటుంబాలు వైసీపీని ఈ డి మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సమక్షంలో శనివారం టిడిపి కండువా కప్పుకున్నారు ఈ సందర్భంగా జెడ్పిటిసి రమాదేవి మాట్లాడుతూ వైసీపీలో సరైన గౌరవం లేదని దీనికి తోడు టిడిపి ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తున్నాడని అభివృద్ధి కార్యక్రమాలు చూసి వైసిపి ని ఈ డి టిడిపిలోకి చేరామని అన్నారు

# ముద్రగడ ఆశయ సాధనకు పార్టీలకు అతీతంగా కృషి చేయాలి

- సంతాప సభలో కాపు నేతలు




**కాకినాడ మన జనప్రగతి జూలై 18:**-మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం ఆశయ సాధనకు పార్టీ లకు అతీతంగా కృషి చేయాలని కాపు నేతలు అన్నారు. శనివారం సాయంత్రం కాకినాడ కాపు కళ్యాణ మండపం లో ఆంధ్రా కాపు సద్భావన సంఘం అధ్యక్షుడు వాసిరెడ్డి యేసు దాస్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కాపు జే ఏ సీ నేతలు యేసు దాస్, ఆకుల రామకృష్ణ, నల్లా విష్ణు మూర్తి, కల్వకొలను తాతాజీ లు మాట్లాడుతూ కాపు జాతి కోసం ప్రాణ త్యాగానికి సైతం సిద్ధపడ్డారని అన్నారు 1994 ఉద్యమంలో కాపు సాధన సమితి నేతలు తో పాటు భార్య పద్మావతి వద్ద సైనైడ్ గుళికలు ఉంచి ఉద్యమం చేశారని గుర్తు చేసారు. ముద్రగడ పోరాట ఫలితంగానే జీ ఓ 30, కాపు కార్పొరేషన్, విదేశీ విద్య ఇవన్నీ ముద్రగడ పోరాట ఫలితంగానే వచ్చాయని అన్నారు. ఆయన నీతి, నిజాయితీలు గుర్తించి ఎన్ టీ ఆర్ సైతం రెండో సారి పిలిచారని చెప్పారు.మండుటెండలో కిర్లంపూడి నుంచి తిరుపతి కీ సైకిల్ యాత్ర చేశారని చెప్పారు.లక్ష్య సాధన కోసం ప్రాణ త్యాగానికి సిద్ధం అయిన గొప్ప చరిత్ర కలిగిన ఉద్యమ కారుడు అని కొనియాడారు.ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మాట్లాడుతూ 1978 లో ఎమ్మెల్యే లు అయిన వారంతా ఉన్నత స్థాయి పదవులు అనుభవించారని,ఆర్థికంగానూ స్థిరపడ్డారని అన్నారు. ముద్రగడ మాత్రం వారందరి కంటే ప్రజల్లో ఎంతో కీర్తి గడించారని అన్నారు.ముద్రగడ వ్యక్తిగతంగా ఎంతో నష్ట పోయినప్పటికీ,ఉద్యమం కొనసాగించిన మహోన్నత వ్యక్తి అని అన్నారు. మాజీ ఎమ్మెల్సీ చిక్కాల రామచంద్రరావు మాట్లాడుతూ అభిమానం,ఆప్యాయతలు, గౌరవానికి పెట్టింది పేరు ముద్రగడ అని చెప్పారు. ఆయన ఆశయాలు కొనసాగించేందుకు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.సమావేశంలో ఆరేటి ప్రకాష్, పేపకాయల రామకృష్ణ, రాగి రెడ్డి చంద్ర కళా దీప్తి, తోట రాజీవ్, నల్లా పవన్,దుగ్గన బాబ్జీ, చిట్నీ డి శ్రీనివాస్, బసవ ప్రభాకర రావు, బుద్ర అనుబాబు, పెద్దింశెట్టి వెంకటేశ్వరరావు, బురిగ ఆశీర్వాదం , సినీ నిర్మాత ముత్యాల రామదాసు, తుమ్మలపల్లి రమేష్, కొప్పిశెట్టి శ్రీనివాస్ పాటు వివిధ పార్టీల నేతలు పాల్గొన్నారు.

# రూ.3.32 కోట్లతో ఎంఆర్ఎఫ్ సెంటర్ ప్రారంభం

- పరిశుభ్రమైన బద్వేలు నిర్మాణానికి ప్రజల సహకారం అవసరం
- టీడీపీ ఇన్‌చార్జి మంచూరు సూర్యనారాయణ రెడ్డి



**పోరుమామిళ్ల మన జనప్రగతి జూలై 18:**-బద్వేలు పట్టణాన్ని పరిశుభ్రంగా, పర్యావరణహితంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఏర్పాటు చేసిన సమీకృత ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రం (మెటీరియల్ రికవరీ ఫెసిలిటీ ఎంఆర్ఎఫ్)ను శనివారం ప్రారంభించారు. బద్వేలు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి మంచూరు సూర్యనారాయణ రెడ్డి ఈ కేంద్రాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఘన వ్యర్థాల నిర్వహణలో ఎంఆర్ఎఫ్ కేంద్రం కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. తడి, పొడి వ్యర్థాలను వేరు చేసి సేకరించడం, పునర్వినియోగం చేయడం, కంపోస్టు తయారీ వంటి కార్యక్రమాలు శాస్త్రీయ పద్ధతుల్లో చేపట్టేందుకు ఈ కేంద్రం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.రూ.3.32 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ ఎంఆర్ఎఫ్ కేంద్రంలో రోజుకు 40 టన్నుల వ్యర్థాలను ప్రాసెస్ చేసే సామర్థ్యం ఉందన్నారు. పట్టణ పరిశుభ్రత కోసం ప్రజలు తమ ఇళ్ల వద్దనే తడి, పొడి చెత్తను వేరు చేసి మున్సిపల్ సిబ్బందికి అందించాలని కోరారు. పరిశుభ్రమైన బద్వేలు నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

# యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

- పల్లె బాటలో ఈగల్‌పై మంగంపేటలోఁద

అవగాహన సదస్సు: ఎస్.ఐ సుజన్ కుమార్





**ఓబులవారిపల్లి మన జనప్రగతి జూలై 18:**-యువత చెడు మార్గంలో పయనించకుండా, మత్తు పదార్థాలకు బానిస కాకుండా అవగాహన కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లె బాట ఈగల్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఓబులవారిపల్లి ఎస్సై సుజన్ కుమార్ తెలిపారు.ఈగల్ ఐజీ ఆర్.కే. రవి కృష్ణ ఐపీఎస్, తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసరావు, రైల్వేకోడూరు రూరల్ సీఐ శ్రీనివాసులు ఆదేశాల మేరకు శనివారం ఓబులవారిపల్లి మండలం మంగంపేట గ్రామంలో ప్రజలకు ఈగల్ కార్యక్రమంపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్సై సుజన్ కుమార్ మాట్లాడుతూ యువత గంజాయి, మత్తు పదార్థాలు, పేకాట, కోడిపందేలు వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.యువత బాగా చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. మైనర్లు ద్విచక్ర వాహనాలు నడపకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని, వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఈగల్ సీఐ ప్రసాద్‌తో పాటు ఓబులవారిపల్లి పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


# ప్రొద్దుటూరులో 4 కిలోల గంజాయి స్వాధీనం..ముగ్గురు అరెస్ట్

**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి జూలై 18:**-ప్రొద్దుటూరులో త్రీ టౌన్ పోలీసులు చేపట్టిన ప్రత్యేక దాడిలో 4 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసినట్లు ఏఎస్పీ విభూ కృష్ణ తెలిపారు. శనివారం ఏఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ వివరాలను వెల్లడించారు.పట్టణంలోని బొల్లవరం వెంకటేశ్వరస్వామి ఆలయానికి ఉత్తర వైపున కాలువ కట్ట సమీపంలోని కంప చెట్ల వద్ద గంజాయి విక్రయాలు జరుగుతున్నట్లు అందిన విశ్వసనీయ సమాచారంతో త్రీ టౌన్ పోలీసులు ఆకస్మికంగా దాడి నిర్వహించారు. ఈ దాడిలో ఇద్దరు యువకులు, ఓ మహిళను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 4 కిలోల గంజాయితో పాటు రూ.3 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు చేసిన వారిని గాళం సిద్దయ్య అలియాస్ శివ, ఉరిమిళ్ల శ్రీనివాసులు అలియాస్ వాసు, బాణాల సువార్తగా గుర్తించినట్లు ఏఎస్పీ తెలిపారు. వీరు గంజాయిని ఇతర ప్రాంతాల నుంచి తీసుకువచ్చి ప్రొద్దుటూరులో విక్రయిస్తున్నట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైందన్నారు.ఈ ఘటనపై ప్రొద్దుటూరు త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలపై పోలీసులు కఠిన చర్యలు కొనసాగిస్తారని, ఇలాంటి కార్యకలాపాలపై సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేసి సహకరించాలని ప్రజలకు ఏఎస్పీ విభూ కృష్ణ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో త్రీ టౌన్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# నేడు జరగనున్న కట్టా పట్టాలమ్మ జాతరను విజయవంతం చేయాలి

- మంగంపేట ఆలయ కమిటీ పెద్దలు



**ఓబులవారిపల్లి మన జనప్రగతి జూలై 18:**-మంగంపేట అగ్రహారం గ్రామం వద్ద వెలసినశ్రీకృష్ణదేవరాయలు కాలం నాటి కట్టా పుట్టాలమ్మ జాతర ఆదివారం అత్యంత వైభవంగా జరుగుతుంది అందుచేత అమ్మవారు భక్తులు మంగంపేట గ్రామస్తులు ప్రజలు కట్టపటాలమ్మ జాతరను తిలకించి కార్యక్రమంలో పాల్గొని జాతరను విజయవంతం చేయాలని ఆలయ పెద్దలు పూజారి అందరికీ ఆహ్వానం తెలుపుతున్నామన్నారు ఈ జాతరకు భక్తులందరూ విచ్చేసి మధ్యాహ్నం భోజన వశతు కూడా కల్పించడం జరిగిందని ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని అమ్మవారికి పూజలు నిర్వహించాలని కోరుతున్నామని వారు తెలిపారు

# గ్రూప్-2 ఉచిత శిక్షణకు జూలై 25 దరఖాస్తుల గడువు

**- జిల్లా బిసి స్టడీ సర్కిల్ సంచాలకులు ఎస్. కృష్ణ**

**కడప మన జనప్రగతి జూలై 18:**- ఎపిపీఎస్సి గ్రూప్-2 ప్రిలిమినరీ2026 పరీక్షకు సిద్ధమవుతున్న వెనుకబడిన తరగతుల (బీసీ), షెడ్యూల్డ్ కులాల (ఎస్సీ), షెడ్యూల్డ్ తెగల (ఎస్టీ) అభ్యర్థులకు ఉచిత శిక్షణ కోసం దరఖాస్తుల గడువు జూలై 25 వరకు పొడిగించినట్లు జిల్లా బిసి స్టడీ సర్కిల్ సంచాలకులు ఎస్. కృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లాలో 100 మంది అభ్యర్థులకు రెండు నెలల పాటు ఉచిత శిక్షణ అందించనున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతోందని, ఆసక్తి గల అభ్యర్థులు జూలై 25వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థుల ఎంపిక కోసం నిర్వహించే అర్హత పరీక్షకు సంబంధించిన దరఖాస్తులు, ఎంపికైన అభ్యర్థుల జాబితా తదితర వివరాలు జూలై 30వ తేదీలోపు వెల్లడిస్తామని తెలిపారు.శిక్షణకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలని, కుటుంబ వార్షిక ఆదాయం రూ.1,00,000 లోపు ఉండాలని పేర్కొన్నారు. అలాగే ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా పాస్‌బుక్, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు తదితర ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.మరిన్ని వివరాలకు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ కార్యాలయాన్ని లేదా 9703185382, 9849919221 నంబర్లను సంప్రదించాలని జిల్లా బిసి స్టడీ సర్కిల్ సంచాలకులు తెలిపారు.

# గ్రంథాలయ సంస్థ చైర్మన్‌ను సన్మానించిన బీఎంఆర్ ట్రావెల్స్ అధినేత



**తిరుపతి మన జనప్రగతి జులై 18 :-** నెల్లూరు అర్బన్ తెలుగుదేశం పార్టీ పరిశీలకులు, చిత్తూరు ఉమ్మడి జిల్లా గ్రంథాలయ చైర్మన్ రెడ్డివారి గురువారెడ్డి ని తెలుగుదేశం పార్టీ ఏర్పేడు మండల బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి, బి.ఎం.ఆర్ ట్రావెల్స్ అధినేత బొడుగు మునిరాజా యాదవ్ అభినందనలు తెలిపి శాలువతో ఘనంగా సత్కరించారు. భవిష్యత్తులో గురువారెడ్డి రాజకీయంగా మరెన్నో ఉన్నతమైన పదవులు అలంకరించాలని, డాక్టరేట్ పురస్కారం అందుకోవడం మా అందరికీ ఎంతో ఆనందంగా ఉందని ముని రాజా యాదవ్ హర్షం వ్యక్తం చేశారు. అభినందనలు తెలిపిన వారిలో టిడిపి యూనిట్ ఇంచార్జ్ కేసినేని సుబ్రహ్మణ్యం, దేవేంద్ర నాయుడు, ఏర్పేడు పిఏసీఎస్ అధ్యక్షులు మహేష్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ మురుగన్ పాల్గొన్నారు.

# ఆంధ్రప్రదేశ్‌లో గోల్ఫ్ టూరిజం అభివృద్ధిపై కపిల్ దేవ్‌తో మంత్రి కందుల దుర్గేష్ చర్చలు



**న్యూఢిల్లీ/అమరావతి:మన జనప్రగతి జులై 18:-** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గోల్ఫ్ టూరిజం అభివృద్ధి, తద్వారా పర్యాటక రంగాన్ని బలోపేతం చేసే అంశాలపై రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ నోయిడా (ఢిల్లీ)లో సుప్రసిద్ధ క్రికెట్ మరియు గోల్ఫ్ క్రీడాకారుడు, పీజీటీఐ అధ్యక్షుడు కపిల్ దేవ్ తో సమావేశమయ్యారు. రాష్ట్రంలో గోల్ఫ్ టూరిజం విస్తరణకు ఉన్న అవకాశాలపై ఇరువురు సుదీర్ఘంగా చర్చించారు. ముఖ్యంగా విశాఖపట్నం, అమరావతి ప్రాంతాలలో గోల్ఫ్ పర్యాటకాన్ని అభివృద్ధి చేసేందుకు గల సాధ్యాసాధ్యాలను మంత్రి దుర్గేష్ .. కపిల్ దేవ్‌కు వివరించారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన క్షేత్రస్థాయి పరిశీలన కోసం ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించాల్సిందిగా కపిల్ దేవ్‌ను మంత్రి దుర్గేష్ అధికారికంగా ఆహ్వానించారు.

మనజనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక
19 - 07 - 2026

# మన కడప స్వచ్ఛ కడప ప్రతి ఒక్కరి బాధ్యత

- కడప ఎమ్మెల్యే రెడ్డప్ప గారి మాధవి రెడ్డి
- కాలువల్లో చెత్త వేస్తే జరిమానాలు,కఠిన చర్యలు తప్పవు




**కడప మన జనప్రగతి జూలై 18:-**నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడం ప్రతి పౌరుడి బాధ్యత అని కడప ఎమ్మెల్యే మాధవి పేర్కొన్నారు. నగరంలోని ఎన్టీఆర్ సర్కిల్ పరిధిలోని 29, 30 డివిజన్లలో శనివారం నిర్వహించిన "మన కడపస్వచ్ఛ కడప" కార్యక్రమంలో ఆమె పాల్గొని పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం డివిజన్ ఇన్‌చార్జి జియావుద్దీన్ ఆధ్వర్యంలో జరిగింది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ హోటళ్లు, ఆసుపత్రులు, దుకాణాలు, విద్యాసంస్థలు తదితర సంస్థలు చెత్తను కాలువల్లో వేయడం వల్ల మురుగునీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడి, వర్షాకాలంలో నీరు నిలిచి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఇకపై దుకాణాలు, వ్యాపార సంస్థలు, ఇతర ప్రాంగణాల వద్ద చెత్త పేరుకుపోయినట్లు గుర్తిస్తే వెంటనే జరిమానాలు విధించి కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.మున్సిపల్ కమిషనర్ భవాని ప్రసాద్ మాట్లాడుతూ "మన కడపస్వచ్ఛ కడప" కార్యక్రమాన్ని ప్రజల భాగస్వామ్యంతో విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నగర పరిశుభ్రతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని అక్కడున్న ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు.తెలుగుదేశం పార్టీ కోఆర్డినేటర్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఇంటి చెత్తను నిర్దేశించిన ప్రదేశాల్లోనే వేయడం, తడిపొడి చెత్తను వేర్వేరుగా నిర్వహించడం ద్వారా నగరాన్ని పరిశుభ్రంగా ఉంచవచ్చని సూచించారు.కార్యక్రమంలో పారిశుధ్య సిబ్బంది, మున్సిపల్ అధికారులు, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ నజీముద్దీన్, మన్సూర్ అలీ ఖాన్, రెడ్డయ్య యాదవ్, బాలకృష్ణారెడ్డి, శిలాస్, అమర్‌నాథ్ రెడ్డి, బాలకృష్ణ యాదవ్, యూనస్ తదితరులు పాల్గొన్నారు.

# పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత

**- స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి పి.హేమ**



**ఎమ్మిగనూరు మన జనప్రగతి జూలై 18:-**పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని, పరిశుభ్రమైన వాతావరణం ఆరోగ్యకరమైన సమాజానికి పునాది అని ఎమ్మిగనూరు జూనియర్ సివిల్ జడ్జి పి. హేమ పేర్కొన్నారు.శనివారం ఎమ్మిగనూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కోర్టు పరిసరాలను శుభ్రపరిచి, పచ్చదనాన్ని పెంపొందించే లక్ష్యంతో మొక్కలు నాటారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా వ్యాధులను నివారించడంతో పాటు అందరి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని జడ్జి హేమ తెలిపారు. పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో భాగంగా చేసుకుని, స్వచ్ఛమైన సమాజ నిర్మాణానికి సహకరించాలని ఆమె పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కోర్టు సిబ్బంది, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

# కడప జిల్లా బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు ప్రసాద్ రావు బ్రాహ్మణ సేవా రత్న అవార్డుకు ఎంపిక



**వేంపల్లె మన జనప్రగతి జూలై 18:-**స్థానిక కందుల ఓబుళరెడ్డి చారిటీస్ ఐటిఐ లో ప్రిన్సిపాల్ గా పని చేస్తున్న కడప జిల్లా బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు పివిఎస్ వి ప్రసాద్ రావు బ్రాహ్మణ సేవా రత్న అవార్డుకు ఎంపికైనట్లు లలితా కళా సమాఖ్య కార్యదర్శి (సేవా సామాజిక సంస్కృతిక సంస్థ) ఎం. అభివర్మ పంపిన లేఖ లో తెలిపారు. లలితా కళా సమాఖ్య ఆధ్వర్యంలోప్రతి సంవత్సరం స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా సువర్ణ కంకణ అవార్డుల సంబరాలను నిర్వహిస్తున్నామని ఈ సారి తెలంగాణ లోని సికింద్రాబాద్ లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆగస్టు 2వ తేదిన సికింద్రాబాద్ లోని ఎస్పి రోడ్డు లో ఉన్న హరిహర కళా భవన్ లో అవార్డుల ప్రదాన కార్యక్రమం ఉన్నట్లు తెలిపారు.ఆ అవార్డుల ప్రదాన కార్యక్రమంలో రాయలసీమ నుండి కడప జిల్లా బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు కందుల ఓబుల్ రెడ్డి ఐటిఐలో ప్రిన్సిపాల్ గా పనిచేస్తున్న ప్రసాద్ రావుకు బ్రాహ్మణ సేవా రత్న అవార్డును ప్రదానం చేస్తున్నట్లు తెలిపారు. బ్రాహ్మణ సమస్య లను ప్రభుత్వం దృష్టి కి తీసుకుపోతు బ్రాహ్మణ సమాజానికి సేవా చేస్తుండం పట్ల గుర్తించి అవార్డును ప్రదానం చేస్తున్నట్లు తెలిపారు. బ్రాహ్మణ సేవా రత్న అవార్డుకు ప్రసాద్ రావు ఎంపిక కావడం పట్ల ఐటిఐ సిబ్బందితో పాటు వేంపల్లె ప్రజలు,కడప జిల్లా బ్రాహ్మణ వర్గం హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# దుర్గమ్మ తల్లిని దర్శించుకున్న శ్రీకాళహస్తి పీఠాధిపతి



**వేంపల్లె మన జనప్రగతి జూలై 18:-**స్థానిక సాయి నగర్ లోని శ్రీ దుర్గమ్మ దేవస్థానంలో శ్రీకాళహస్తి శుకబ్రహ్మ ఆశ్రమశీ పీఠాదిపతి పూజ్య విద్యా స్వరూపానంద స్వామీజీ దర్శించుకున్నారని ఆలయ వ్యవస్థాపకులు మాచిరెడ్డి రవికుమార్ రెడ్డి తెలిపారు. శనివారం దుర్గమ్మ దేవస్థానంలో ఆలయ అర్చకులు విష్ణుశర్మ, వ్యవస్థాపకులు రవికుమార్ రెడ్డి స్వాగతం పలికారు.అనంతరం పీఠాధిపతి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.రాబోయే కాలంలో ఈ ఆలయం ఎంతో మహిమలతో కూడి ప్రసిద్ధి చెందుతుందని స్వామీజీ తెలిపారు. పలువురు భక్తులు విద్యా స్వరూపానంద స్వామీజీవారి ఆశీస్సులు తీసుకున్నారు.ఆలయంలోపల హోమాలు,పూజా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. స్వామిజీని వ్యవస్థాపకులు దుశ్శాలువతో సత్కరించి స్వామీజీ ఆశీస్సులు పొందారు.ఈ కార్యక్రమంలో గండి భూమానంద ఆశ్రమ అధిపతులు ప్రతిభానంద మాతాజీ,ఉత్తరాధికారి స్వామి అభినవ శంకరానంద స్వామీజీ, తదితరులు పాల్గొన్నారు.

# తిరుమల పాదయాత్ర విజయవంతం

- మంచూరి సూర్యనారాయణ రెడ్డిని

**కలిసిన పాలకొండు రాజశేఖర్ రెడ్డి బృందం**



**కడప మన జనప్రగతి జూలై 18:-**టీడీపీ బద్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా మంచూరి సూర్యనారాయణ రెడ్డిని పార్టీ అధిష్టానం నియమించిన సందర్భంగా అట్లూరు మండలం కుంభగిరి క్రాస్‌లోని శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం నుంచి జూలై 15న టీడీపీ యువ నాయకుడు, ఎన్నారై పాలకొండు రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలోని పీఆర్ఎస్ఆర్ (పిఆర్ఎస్ఆర్) బృందం తిరుమలకు పాదయాత్ర ప్రారంభించింది.పాదయాత్ర విజయవంతంగా పూర్తి చేసి తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్న బృందం, తమ మొక్కులు చెల్లించుకొని, అనంతరం శుక్రవారం బద్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి, కడప జిల్లా డీసీసీ బ్యాంకు చైర్మన్ మంచూరి సూర్యనారాయణ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పాలకొండు రాజశేఖర్ రెడ్డి బృందం, మంచూరి సూర్యనారాయణ రెడ్డితో పాటు స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ (ఎస్ఎసి ) చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్‌ను కూడా కలిసి, తిరుమల శ్రీవారి లడ్డు ప్రసాదం, శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు.ఈ సందర్భంగా మంచూరి సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ, "శ్రీవారి ఆశీస్సులతో అందరికీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని, బద్వేల్ నియోజకవర్గ ప్రజలకు శుభం చేకూరాలని కోరుకుంటున్నానని తెలిపారు.

# వర్షాభావ పరిస్థితుల్లో ఉల్లి పంటకు శస్యరక్షణ చర్యలు చేపట్టాలి

**- ఉద్యాన శాఖ అధికారి మల్లేశ్వర రెడ్డి సూచనలు**



**తొండూరు మన జనప్రగతి జూలై 18:-**ఎల్‌నీనో ప్రభావంతో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల్లో ఉల్లి పంటను కాపాడుకునేందుకు రైతులు తగిన శస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఉద్యాన శాఖ అధికారి మల్లేశ్వర రెడ్డి సూచించారు. తొండూరు మండలంలోని గంగాదేవిపల్లి, చెర్లోపల్లి, గంగణపల్లి గ్రామాల్లో ఉల్లి పంటలను పరిశీలించిన ఆయన రైతులకు పలు సూచనలు చేశారు.తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో తోటల్లో నీటి పారుదల కోసం డ్రిప్, రైన్‌పోర్ట్ పద్ధతులను తప్పనిసరిగా వినియోగించాలని సూచించారు. మొక్కల ఎదుగుదల తగ్గకుండా ఉండేందుకు థాయో యూరియాను లీటరు నీటికి ఒక గ్రాము లేదా పొటాషియం నైట్రేట్‌ను లీటరు నీటికి 7 గ్రాముల చొప్పున కలిపి పిచికారీ చేయాలని తెలిపారు.అలాగే ప్లాస్టిక్ మల్చింగ్ షీట్లను వినియోగించడం ద్వారా భూమిలో తేమ శాతం నిల్వ ఉంటుందని, నీరు ఆవిరి కాకుండా పంటకు ఉపయోగపడుతుందని వివరించారు. ఎండ తీవ్రత కారణంగా రసం పీల్చే పురుగులు, పర్పుల్ బ్లాచ్ (ఆకు ఉదార మచ్చ) తెగులు నివారణకు ప్రొపైనీబ్ లేదా పైరాక్లోస్ట్రాబిన్ మందులను లీటరు నీటికి 2 గ్రాముల చొప్పున, ఫిప్రోనిల్‌ను 2 మిల్లీలీటర్ల చొప్పున కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# ఆర్థిక లావాదేవీలపై అవగాహన ఉండాలి

**- డిఆర్డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ రాజ్యలక్ష్మి**



**వేంపల్లె మన జనప్రగతి జూలై 18:-** పొదుపు సంఘంలోని సభ్యులందరికీ జరుగుతున్న ఆర్థిక లావాదేవీలపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని, మన డబ్బు మన లెక్కలు కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ(డిఆర్డిఏ) ప్రాజెక్ట్ డైరెక్టర్ రాజ్యలక్ష్మి సూచించారు. శనివారం గ్రామ సమాఖ్య -4 కార్యవర్గ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రతి మహిళా సభ్యురాలు ఆర్థిక లావాదేవీలపై సంపూర్ణ అవగాహన పెంచుకొని, జీవనోపాధిని ఏర్పాటు చేసుకోవాలన్నారు. దీని ద్వారా అధిక ఆధాయం పొంది ఆర్థికంగా బలోపేతం కావాలని ఆకాంక్షించారు. మహిళలు వ్యాపార వేత్తలుగా తాయారై మహిళా సాధికారత దిశగా అడుగులు వేయాలని కోరారు. వెలుగు ఏపిఎం వెంకటేశ్వర రావు, సీసీ లు రామలింగయ్య, అనిల్, బాబు, రెడ్డయ్య, సదాశివుడు, జయలక్ష్మీ, ప్రసాద్, సిబ్బంది వీరాంజనేయలు తదితరులు పాల్గొన్నారు.**ఇ-బైక్ షోరూం ప్రారంభం..** స్రవంతి మహిళా సమాఖ్య సభ్యురాలు ప్రభావతి ఏర్పాటు చేసుకున్న ఇ-బైక్(ఏడిఎంస్) షోరూం ని డీఆర్డీఏ పీడీ రాజ్యలక్ష్మి ప్రారంభించారు. ప్రభుత్వం ద్వారా అందుతున్న పథకాలను సద్వినియోగం చేసుకుని వ్యాపార వేత్తలుగా తాయారై ఆదర్శంగా నిలవాలని కోరారు. యూనియన్ బ్యాంక్ మేనేజర్ వెంకట రమణ, ఏపిఎం వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యకర భవిష్యత్‌ని తీర్చిదిద్దాలి: ప్రిన్సిపాల్ డా.ఉషశ్రీ

- స్వర్ణాంధ్ర..స్వచ్ఛాంధ్ర పై అవగాహన ర్యాలీ



**వేంపల్లె మన జనప్రగతి జూలై 18:-**పరిసరాల పరిశుభ్రత తో ఆరోగ్యకర భవిష్యత్ ని తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాల్సిన అవసరం ఉందని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.ఉషశ్రీ వెల్లడించారు. శనివారం స్వర్ణాంధ్ర.. స్వచ్ఛాంధ్ర పై విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత ద్వారా ఆరోగ్యకరమైన జీవితాన్ని బాటలు వేయవచ్చన్నారు. ప్రతి విద్యార్థి వారంలో కనీసం ఒక గంట సమయాన్ని పరిశుభ్రతకు కేటాయించి శుభ్రతకు చర్యలు చేపట్టాలని సూచించారు. ప్లాస్టిక్ వాడకాన్ని క్రమేణ తగ్గించి, వాతావరణ పరిరక్షణకు కృషి చేయాలని కోరారు.వైస్ ప్రిన్సిపాల్ నాగేంద్ర, అధ్యాపకులు సతీష్, హరిత,హజీయ,రాజారెడ్డి,పీడీతేజేంద్ర,సిబ్బంది పాల్గొన్నారు.

# సిడిపిఓ సునిత ఆధ్వర్యంలో బాలికే భవిష్యత్

**- భ్రుణ హత్యల నివారణకు కృషి చేయాలి**



**వేంపల్లె మన జనప్రగతి జూలై 18:-** చెల్డ్ డెవలప్మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ (సిడిపిఓ) వి.సునిత ఆధ్వర్యంలో బాలికే భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. శనివారం స్థానిక జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో బేటి బాచావో, బేటి పడావో..బాలికే భవిష్యత్ పై విద్యార్థినిలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిడిపిఓ సునిత మాట్లాడుతూ భ్రుణ హత్యల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. తల్లిగర్భంలో ఉండగానే ఆడపిల్ల అని తెలుసుకొని అబార్షన్ చేసే పరిస్థితులు ఉన్నాయన్నారు. దీనివల్ల స్త్రీ, పురుష నిష్పత్తి సమతుల్యత దెబ్బతిని బాలికల పట్ల వివక్షత, అఘాయిత్యాలు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. బాలికలకు చదువు ఒక ఆయుధం వంటిదని, ప్రతి విద్యార్థిని బాగా చదివి ప్రగతి పథంలో ముందుకెళ్లి, స్వయం ప్రతిపత్తితో నిలదొక్కు కోవాలన్నారు. బాల్య వివాహాలు, లైంగిక వేధింపులు, అక్రమ రవాణా, స్కూల్ డ్రాప్‌ఔట్ వంటి సమస్యల నివారణకు హెల్ప్ లైన్ 1098కి సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఇఓ స్టాలిన్ ఐజాక్, ఇంచార్జీ హెచ్ఎం చెరుకూరి శ్రీనివాసులు, ఐసిడిఎస్ సూపర్వైజర్లు స్వర్ణలత, సుభద్ర, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# తపస్య పాఠశాలలో ఘనంగా ఎల్లో కలర్ డే




**కలికిరి మన జనప్రగతి జూలై 18:-** కలికిరి కె. రెడ్డివారి పల్లె నందు గల తపస్య పాఠశాలలో ఎల్లో కలర్ డే (పసుపు) ను ఘనంగా సెలబ్రిటీ చేశారు.పాఠశాల కరెస్పాండెంట్ యం. రామాంజులు నాయుడు, మరియు క్యాంపస్ ఇన్చార్జ్ యం. శివప్రసాద్ గార్ల ఆధ్వర్యంలో ఎల్లో కలర్ డే ను నిర్వహించడం జరిగినది. శుభానికి సూచిక పసుపు. పసుపు రంగు ప్రత్యేకతను కరెస్పాండెంట్ రామాంజులు నాయుడు పిల్లలకు వివరించారు. పాఠశాల ఆవరణాన్ని పసుపు రంగుతో ఉండే అన్ని పసుపు రకాలతో ముస్తాబు చేశారు, పిల్లలు, ఉపాధ్యాయులు పసుపు రంగు వస్త్రధారణలో వచ్చి ప్రత్యేకతను చాటుకున్నారు, పసుపు రంగులో ఉండే పూలు, పండ్లు, ఆహార పదార్థాలు మొదలైన వస్తులన్ని పాఠశాలలో ప్రదర్శన ఏర్పాటు చేశారు. పసుపు రంగు తో ప్రత్యేకంగా పిల్లలు ఆటలు, పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. పాఠశాల ప్రిన్సిపల్ యన్. మాధవి, కె. పేమలత మరియు ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, విద్యార్థులు అందరూ పాల్గోని విజయవంతం చేశారు.

PRINTER, PUBLISHER AND OWNED BY **YADATI VIVEKANANDA REDDY YADAV**, AND PRINTED AT M/S GOKUL PUBLICATIONS, # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), PUBLISHED AT # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), Editor : YADATI VIVEKANANDA REDDY YADAV, E-Mail :manajanapragathi@gmail.com, Cell : 8125555507 RNI No : - APTEL/2021/80174